PLATINUM JUBILEE YEAR

Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

జమీన్‌రైతు

సంపుటి : 77 సంచిక :27 7.7.2006 శుక్రవారం 12పేజీలు విడిప్రతి: రూ.3.00

డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు

- బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్‌టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో , అన్ని హంగులతో బ్యాంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)
- ప్రతి రోజూ వివిధ రకాల వెజ్ & నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ.160/-లకే

మరిన్ని వసతులతో మీకు స్వాగతం పలికే

మీ డి.ఆర్. ఉత్తమ ★ ★ ★ హోటల్

D.R. UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

జి.ప. ఎన్నికల్లో బయల్పడ్డ వాస్తవం

రాజశేఖర్‌రెడ్డి వైపే జనం!

రాష్ట్రంలో కనీసం ఐదు జిల్లా పరిషత్‌లలో తెలుగుదేశం పార్టీ ముందంజ వేయబోతుందని గతవారం 'జమీన్‌రైతు' వేసిన అంచనా నూటికి నూరుపాళ్లు నిజమైంది. ఆదిలాబాద్, వరంగల్, రంగారెడ్డి జిల్లా పరిషత్‌లను తెలుగుదేశం పార్టీ పూర్తి ఆధిక్యంతో గెలుచుకున్నది. ఖమ్మం, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఇంచుమించు కాంగ్రెస్‌తో సమాన స్థాయిలో నిలిచింది. వరంగల్, కరీంనగర్ వంటి జిల్లాలలో కాంగ్రెస్ తనకు తానుగా జిప ఛేర్మన్ పదవి పొందలేని స్థితి కల్పించింది. పదిహేను జిల్లాలలో కాంగ్రెస్ పార్టీ తన పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించగలిగింది. కాంగ్రెస్ పార్టీకి కానీ, ముఖ్యమంత్రికి కానీ అది గర్వించదగిన విజయం క్రిందనే లెక్క. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచిన తర్వాత కూడా ప్రజాభిమానం చెక్కు చెదరకుండా నిలబెట్టుకోగలగడం కంటే ఏ ముఖ్యమంత్రికైనా కావలసింది ఏమి వుంది? 2001లో ఇదే పరిస్థితులలో ఇవే ఎన్నికలకు వెళ్లిన తెలుగుదేశం పార్టీ జనం నుంచి ఎటువంటి ఛీత్కారాలు ఎదుర్కొన్నదీ తెలిసిన సంగతే. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది జిల్లా పరిషత్‌లు గెలుచుకున్నది. దానితో పోల్చి చూసినా ఇప్పుడు రాజశేఖరరెడ్డి సాధించిన ఫలితాలు గర్వపడదగినవి క్రిందనే లెక్క

అయితే గెలిచిన కాంగ్రెస్ ఏదో తప్పు చేసినట్లుగా ఆత్మరక్షణలో పడిపోతే, నామమాత్రమైన ఫలితాలు సాధించిన తెలుగుదేశం మాత్రం ఏదో ఘనకార్యం సాధించినంతగా సంబరపడి పోతున్నది. ఇదొకరకం రాజకీయ విచిత్రం. ఒకరకంగా దానికి బాధ్యత కూడా ముఖ్యమంత్రిదే. ఎన్నికల ప్రకటన వెలువడగానే, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పది శాతం సీట్లు కూడా రావు అని ఎగతాళి మాటలన్నాడు. ఏ జిల్లాలో గెలవగలదో చెప్పమనండి చూద్దామని సవాలు విసిరాడు. ఏ జిల్లాలో కూడా వారికొచ్చే సీట్లు సింగిల్ డిజిట్ దాటబోవడం లేదని నమ్మకంగా చెప్పాడు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అనేది నామరూపాలు లేకుండా పోబోతున్నదని; అందుకు తాము వ్యూహం రచించామన్నట్లుగా సాగాయి ఆయన ప్రకటనలు. తెలుగుదేశం ఎక్కడ గెలిచినా గొప్పే అనే భావం ఆయనే కల్గించాడు. దానితోనే వచ్చింది

తరువాయి 7వ పేజీలో

బలమున్న చోటనే ఓటమి

కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో తమ ఓటమికి కారణం తెలియక జుట్టు పీక్కొంటున్నారు తెలుగు నేతలు. కమ్మ కుల ప్రాబల్యం బాగా వున్న జిల్లాలివి. తెలుగుదేశం అధికారంలో వున్నన్ని రోజులూ ఈ జిల్లాల మీద పెత్తనం కూడా వారిదే. కోడెల శివప్రసాద్, కరణం బలరాం, వడ్డే శోభనాదీశ్వరరావు, తదితరులు తమ మాట నెగ్గించుకుంటూ వచ్చారా రోజులలో. రాష్ట్రంలో కమ్మ కులస్తులందరూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల శత్రు భావనలతో వున్నారన్న అభిప్రాయం ఒకటి వుంది. రాజశేఖరరెడ్డి రెడ్ల పక్షపాతి అనే ప్రచారం కూడా వుంది. అయితే ఆ కమ్మ కులం ప్రాబల్యం ప్రగాఢంగా వుండే జిల్లాలలో తెలుగుదేశం

తరువాయి 7వ పేజీలో

కెకె కాళ్ల క్రిందకు నీళ్లు?

ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్లు స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీకి జరిగిన నష్టానికి పిసిసి అధ్యక్షుడు కె.కేశవరావును బాధ్యుడుని చేస్తారన్న పుకారు గాంధీభవన్ ఆవరణంలో షికారు చేస్తున్నది. ఒక్క తెలంగాణాలో మాత్రం కాంగ్రెస్ కొంతమేరకు నష్టపోయిందని; అందుకు కారణం టిఆర్ఎస్‌తో పొత్తు వ్యవహారాలు సరిగా నడపలేక పోవడమని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ఈ వదంతికి ఆధారం. టిఆర్ఎస్ పొత్తు సంగతులన్నీ పూర్తిగా కెకె నేతృత్వంలోనే నడిచాయి. ఏ దశలోనూ ముఖ్యమంత్రి తెరమీదకు రాలేదు. నామినేషన్ల ఉపసంహరణల వరకు చర్చలు జరిపినప్పటికీ రెండు పార్టీల మధ్య ఒక అవగాహన కుదరలేదు. ఒకరికి కేటాయించిన స్థానాలలో మరొకరు పోటీలోకి దిగడం వల్ల ఇద్దరికీ నష్టం జరిగింది. తిరుగుబాటు అభ్యర్థులను అదుపులో పెట్టి, పొత్తు ఒప్పందాలను సక్రమంగా నిర్వహించి వుంటే తెలంగాణాలో కాంగ్రెస్ అంత నష్టపోయే పరిస్థితి ఏర్పడి వుండేది కాదని ఒక వాదన.


తరువాయి 7వ పేజీలో

మూడింటా ఇరకాటమే

జరపబోయే మంత్రివర్గ విస్తరణకు జిప ఎన్నికల ఫలితాలను ప్రాతిపదికగా తీసుకుంటానని అటు మంత్రులు, ఇటు ఎమ్మెల్యేలను పలుమార్లు హెచ్చరించారు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి. మీమీ నియోజక వర్గాలలో గెలవకుంటే, ఇక నా దగ్గరకు రావద్దు, ఏ పనీ అడగవద్దు అని కూడా చెప్పారు. ఆయన మాటలలోని కరకుదనం చూసిన ఎమ్మెల్యేలు, మంత్రులు కంటి మీద కునుకు లేకుండా ఎన్నికలలో కష్టపడ్డారు. డబ్బు క్రుమ్మరించారు. కాంగ్రెస్‌ను గెలిపించారు. అయితే ఇప్పుడా హెచ్చరికలు ముఖ్యమంత్రి గొంతులో పచ్చి వెలక్కాయ వలె పడడం విశేషం. అనంతపురం, రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలలో కాంగ్రెస్ ఓటమికి ఎవరిని బాధ్యులను చేయాలి అన్న ప్రశ్నకు సమాధానం దొరకక ఇరకాటంలో పడ్డారాయన. అనంతపురం జిల్లా మంత్రులైన జెసి దివాకరరెడ్డి, రఘువీరారెడ్డి లిరువురూ ఆయనకు బాగా కావలసిన వారు. ముఖ్యంగా జెసి జోలికి వెళ్లే సాహసం లేదు. రంగారెడ్డి జిల్లాలో మంత్రి సబితా

తరువాయి 7వ పేజీలో

శ్రీ షిర్డి సాయిబాబా గురు పూర్ణిమ మహోత్సవ ఆహ్వానము



11.07.2006 మంగళవారం నుండి 21.07.2006 శుక్రవారం వరకు నెల్లూరు గాంధీనగర్, ట్రంకురోడ్డు నందు గల శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో బాబా వారి గురు పూర్ణిమ మహోత్సవం జరుగును

ప్రతి రోజు ఉదయం 7.30 గంటల నుండి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగును.

పై పూజా కార్యక్రమాలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.50/-లు చెల్లించి రశీదు పొందవలసినదిగా కోరడమైనది.

పై పూజలు 11-07-2006 మంగళవారం నుండి 15-07-2006 శనివారం వరకు జరుగును.

నగరోత్సవం: 17-7-2006 సోమవారం సాయంత్రం 6గం॥లకు శ్రీ బాబా వారి నగరోత్సవం పుష్పాలంకారములతో, మంగళ వాయిద్యములతో సాంస్కృతిక ప్రదర్శనలతో, విద్యుద్దీపకాంతులతో బాణసంచా వేడుకలతో వైభవంగా జరుగును. పై కార్యక్రమంలో భక్తులెల్లరూ పాల్గొనవలసినదిగా కోరడమైనది.

అన్నదానం: 21.7.2006 శుక్రవారం మధ్యాహ్నం 11.00 గంటల నుండి అన్నదాన కార్యక్రమము జరుగును.

పై అన్నదానమునకు భక్తులు తమకు తోచిన విధముగా వస్తురూపంలోగాని, ద్రవ్య రూపంలోగాని సహకరించి శ్రీ సాయినాథుని కృపకు పాత్రులగుదురుగాక

సాంస్కృతిక కార్యక్రమములు : 11-7-2006 మంగళవారం నుండి 19-7-2006 బుధవారం వరకు ప్రతి రోజు సాయంత్రం 6-30గం.ల నుండి కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆవరణంలో ప్రఖ్యాత ఉపన్యాసకులు, రామాయణ ప్రవచన సుధాకర "డా॥ మైలవరపు శ్రీనివాసరావు" గారిచే "శ్రీమద్రామాయణ అయోధ్యా కాండము" ఉపన్యాస మహాయజ్ఞం జరుగును. కావున భక్తులందరూ విచ్చేయ ప్రార్థన. **గమనిక:** ఆషాఢ మాసం నందు "అయోధ్యకాండ" ఉపన్యాస పారాయణము వినుట విశేష పుణ్యఫలం.

పై కార్యక్రమాలలో భక్తులెల్లరూ పాల్గొని బాబా వారి అన్నప్రసాదములు స్వీకరించి వారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.

కార్యవర్గము : శ్రీ షిర్డి సాయిబాబా మందిరము

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్: 2327771

కలసివుంటే కలసి వచ్చిన అదృష్టం

నెల్లూరు జిల్లాలో జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవీకాంత పరిష్వంగం కాంగ్రెస్ పార్టీకి ఎండమావిగా మిగిలిపోతుందేమోనని సందేహం వ్యక్తం చేశాము గత వారం. కానీ అది అర్థరహితమైన సందేహం అని రుజువు చేశారు కాంగ్రెస్ నేతలు. ఛైర్మన్ పదవి గెలుచుకోవడానికి అవసరమైన దానికంటే అధికంగా జడ్పీటీసి స్థానాలు గెలిపించారు.

మొత్తం 46 జడ్పీటీసి స్థానాలలో కాంగ్రెస్ పార్టీకి 31 స్థానాలు దక్కాయి. తెలుగుదేశం 15కి పరిమితమైంది. కమ్యూనిస్టులకు ఒక్క స్థానం కూడా రాలేదు. అయితే మండలాలకు వచ్చే సరికి ఈ లెక్కల్లో కొంత మార్పు వచ్చింది. కాంగ్రెస్ 28 మండలాలలో అధ్యక్ష పదవులు తన స్వంతం చేసుకుంటే, టిడిపికి తొమ్మిది మండలాలు లభించాయి. ఆరు మండలాలలో ఇరు పార్టీలకూ సమాన బలం రావడంతో బొమ్మా బొరుసు ఆటలో ఎవరిని అదృష్టం వరిస్తే వారికే పదవీ యోగం చిక్కుతుంది.

31 స్థానాలలో హస్తం హవా నడవడం నిజంగా ఆశ్చర్యకరమే. పోలింగ్ మూడు నాలుగు రోజుల ముందు వరకు పరిస్థితి అట్లా లేదు. మొత్తం మీద కాంగ్రెస్ ఆధిక్యత సాధించినా ఒకటి రెండు ఓట్ల తేడాకు మించక పోవచ్చునన్న అభిప్రాయం సర్వత్రా ఏర్పడి వుండింది. చివరి క్షణాలలో అది తారుమారైంది. అందుకు కాంగ్రెస్ సమర్థత కంటే తెలుగుదేశం చేతకానితనం కారణమనడం వాస్తవం. నెల్లూరులో తమ పార్టీ అస్తవ్యస్తంగా వుందన్న నిజాన్ని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చాలా ముందుగానే గ్రహించారు. అందువల్లనే మామూలూరు వచ్చినప్పుడు ఎమ్మెల్యేల మీద కన్నెర్ర చేసి, భారమంతా మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి మీద పెట్టారు. అప్పటి వరకు ఎమ్మెల్యేల వల్ల తనకు కల్గిన మనస్తాపాన్ని మర్చిపోయి, వారిని కలుపుకపోవడానికే కాదు, వారందరి బరువూ తానే మోయడానికి సిద్ధపడడం జనార్దనరెడ్డి కాంగ్రెస్‌కు చేసిన మహోపకారం క్రింద లెక్క. ఆయన ఆ విశాల హృదయంతో వ్యవహరించక పోయి వుంటే, ఎన్నికల వ్యూహాన్ని రచించడమే కాకుండా, అమలు సైతం తనపైనే వేసుకోకుంటే నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్ గెలుపు ఎండమావిగానే మిగిలిపోయి వుండేది.

ఆత్మకూరు స్వతంత్ర ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడును పార్టీ కొగిలిలోకి తీసుకోవడం ఈ వ్యూహంలో కీలక భాగం. దానివల్ల కాంగ్రెస్‌కు ఐదు జడ్పీటీసిలలో ఎదురు లేకుండా పోయింది. మరి రెండింటిలో గెలుపు సుకరమైంది. చేజర్ల, కలువాయి, ఆత్మకూరు, అనంతసాగరం, ఎఎస్ పేటలో కొమ్మి కలయికతో తెలుగుదేశం నిర్వీర్యమై పోయింది. పోటీకి సరైన అభ్యర్థులు కూడా దొరకలేదు వారికి. ఎన్నిక ఏకపక్షమైంది. పొదలకూరు, సంగం జడ్పీటీసిలలో కొమ్మి అనుచర వర్గం మద్దతు కాంగ్రెస్ గెలుపుకు బాగా ఉపకరించింది.

ఆదాల ప్రభాకరరెడ్డి, నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మలు చివరి నిముషంలో తీసుకున్న జాగ్రత్తలు ఆ రెండు నియోజక వర్గాలలో ఎనిమిది జడ్పీటీసిలను గట్టెక్కించాయి. వాటిలో వచ్చిన స్వల్ప మెజారిటీలను చూస్తే అర్థమై పోతుందా పరిస్థితి. వెంకటాచలం, తోటపల్లి గూడూరు, ఓజిలి, డక్కిలి, బాలాయపల్లి జడ్పీటీసిలు ఐదారు వందల ఓట్ల తేడాతో బయట పడ్డాయి. కాంగ్రెస్ పరంగా కొంచం అలసత్వం ప్రదర్శించి వుండినా, తెలుగుదేశం వాదులు నిద్రమత్తు వదిలించుకుని వుండినా ఇవన్నీ ప్రమాదంలో పడివుండేవనడం ఖాయం.

ఎమ్మెల్యేలు ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకోకుంటే ఏమి జరుగుతుందో సూళ్లూరుపేట, అల్లూరు నియోజక వర్గాలను చూస్తే అర్థమై పోతుంది. సూళ్లూరుపేట

తొరవ 6వ పేజీలో

పుట్టినింట్లో పరాభవం

జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ విజయోత్సవాలలో మునిగి తేలుతుంటే, నెల్లూరు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మాత్రం ముసుగు కప్పుకుని మూల దాక్కున్నట్లున్నాడు. ఫలితాలు వెలువడిన తర్వాత ఇందిరాభవన్‌లో జరిగిన విజయోత్సవ సంరంభంలో కానీ, జనార్దనరెడ్డి గారింట విందులో



కానీ ఆయన ఆచూకీ కన్పించలేదు. ఆనం కుటుంబానికి పుట్టినిల్లనదగిన చింతారెడ్డిపాళెంలో కాంగ్రెస్ ఎమ్పీటీసి అభ్యర్థి ఘోర పరాజయం అందుకు కారణమై వుండవచ్చు. డెబ్బయ్యేళ్ల క్రితం స్వర్గీయ ఎసి సుబ్బారెడ్డి రాజకీయాలలోకి వచ్చిన నాటి నుంచి చింతారెడ్డిపాళెం


తొరవ 7వ పేజీలో

జీవితకాలం రుణపడి ఉంటా!









ఆంధ్రుల అభిమాన నేతలు,
ప్రజా హృదయ విజేతలు,
మన ప్రియతమ నాయకులు
ముఖ్యమంత్రి **డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డి,**
విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు
శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి గార్ల
ఆశీస్సులు, అండదండలతో
మీ ముందుకు వచ్చిన నన్ను
అఖండ మెజారిటీతో గెలిపించిన వారందరికీ
కృతజ్ఞతాభివందనములు.

అభివృద్ధి పథకాల అమలులో,
ప్రజాసేవా కార్యక్రమాలలో
నా శక్తి వంచన లేకుండా శ్రమిస్తానని
ప్రమాణం చేస్తున్నాను.

అవకాశవాద, అవినీతికర రాజకీయాలను
A.S.పేట గడప తొక్కనీయనని హామీ ఇస్తున్నాను.

మీరు ప్రసాదించిన జడ్పీటీసి సభ్యత్వాన్ని
మీ సేవకే అంకితం చేస్తానని,
ఈ అపూర్వమైన అవకాశాన్ని కల్పించిన
A.S.పేట ప్రజలందరికీ రుణపడి వుంటానని
మనవి చేస్తున్నాను.

బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి
జడ్పీటీసి మెంబర్, **A.S.**పేట

In the Court of the IIIrd Addl.Junior Civil Judge :: Nellore

O.S.No: 904/2005

Pedidapu Subbamma and another ... Plaintiff
Vs
K.S.Gopi and others... Defendants

NOTICE

To, D1, **K.S.Gopi**, S/o Sankarankutty, Trissur Town, Malla Village, Kerala State. At present Thukumanimitta, Nellore, Nellore Dist.

D2, **Mar Jli Venkata Ramanamma**, W/o Rama Chandraiah Residing at 11/262-3, Brahmin Street, Santhapet, Nellore

D3, **Devella Hari Babu**, S/o Pitchaiah, Residing at 11/454, Thukumanimitta, Srinivasapuram, Santhapet, Nellore.

ఈ నెంబరున వాదులు మీపై దావా చేసినందులకు మరియు **I.A.972/05** యింజక్షన్ పిటిషన్ పెట్టినందులకు మీకు నోటీసు నిమిత్తం **తే 9-8-2006** ది కోర్టులో వాయిదా వేసివున్నారు. మీకుగల ఆక్షేపణలు ఆ రోజు ఉదయం గం. **10.30**నిలకు పై కోర్టులో మీరు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు Exparty గా తీర్మానించబడును.

G.Subbalakshmi , B.A., B.L.,
Advocate for the Plaintiff, Nellore

పై పెత్తనం మానండి

స్థానిక ఎన్నికలను సకాలంలో జరిపించింది రాష్ట్ర ప్రభుత్వం. ఏవో కుంటి సాకులు చూపి అధికారుల రాజ్యం నడిపించకుండా, పాత పాలక వర్గం గడువు తీరేలోగా కొత్త వాటిని ప్రతిష్ఠించడం అభినందనీయం. గాంధీ మహాత్ముడి నుంచి రాజీవ్‌గాంధీ వరకు కోరుకున్నది అదే. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లితేనే దేశంలో అది వచ్చగా వుంటుంది. దేశానికి అవసరమైన కొత్త నాయకత్వం ఎప్పటికప్పుడు పుట్టుకుని వస్తుంది. అయితే ఇల్లలకగానే పండుగ కానట్లే, ఎన్నికలు జరపగానే ప్రభుత్వ బాధ్యత తీరిపోదు. ఎన్నికైన పాలక వర్గాలు ప్రజల కోసం పనిచేసే పరిస్థితి కల్పించాలి. ఆ అవకాశం ఇవ్వాలి.

దురదృష్టవశాత్తు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను ఒక క్రమ పద్ధతిలో నిర్వీర్యం చేస్తూ వస్తున్నది. పాలక వర్గాలను అలంకార ప్రాయం చేస్తున్నది. గ్రామ పంచాయతీ, మండలం, జిల్లా పరిషత్‌లు మూడింటికీ ఇదే దుర్గతి. ఎన్నికైన ప్రజా ప్రతినిధికి ఎటువంటి అధికారాలూ వుండవు. చేయడానికి పని వుండదు. నిధులు ఇవ్వరు. ఒకవేళ ఇచ్చినా వాటితో చేపట్టవలసిన పనులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు ఎటువంటి ప్రమేయం వుండదు. ఎమ్మెల్యేల సిఫార్సు చీటీల ప్రకారం కలెక్టర్లు నేరుగా పనులు మంజూరు చేస్తారు. ఆ పనుల మీద పర్యవేక్షణలో కూడా ఎన్నికైన ప్రజా ప్రతినిధికి పాత్ర లేదు. దిగువ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జరిగిపోతాయవి. ఈ అధికారులంతా ఎమ్మెల్యే కనుసన్నలలో పనిచేయడం ఆనవాయితీ. ఏ మండలానికి ఏ అధికారిని బదలీ చేయాలో నిర్ణయించేది ఎమ్మెల్యేలు మాత్రమే. దానితో వారు తాము ఎమ్మెల్యేలకు బాధ్యులమన్నట్లు ప్రవర్తిస్తుంటారు. ఈ పరిస్థితి వల్ల పంచాయతీలు, మండలాలకు పేరుకు పాలక వర్గాలున్నప్పటికీ, పెత్తనం మాత్రం ఎమ్మెల్యేలదిగా కొనసాగుతున్నది.

రాజీవ్‌గాంధీ కోరుకున్నది ఇది కాదు. ఆయన జరిపించిన రాజ్యాంగ సవరణలో స్థానిక సంస్థల అధికారాల గురించి స్పష్టంగా నిర్వచనం ఇచ్చారు. స్థానిక స్వపరిపాలనా దిశవైపుగా ఈ సంస్థలను నడిపించాలన్నది రాజీవ్‌గాంధీ ఆశయం. మన ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారికి రాజీవ్ నామస్మరణ చేయడం ఆనవాయితీ. ఏ పథకం ప్రారంభించినా, ఏ కార్యక్రమం తలపెట్టినా దానికి రాజీవ్ గాంధీ పేరు పెట్టడం ఆయనకలవాటు. అయితే ఆ భక్తి పేరుకు పరిమితం కాకుండా, ఆయన ఆశించిన ఆదర్శాన్ని అమలు చేసే దిశగా నడుచుకోవడం ముఖ్య మంత్రి చేయదగ్గ సబబైన పని.

జమీర్‌రైతు

స్థానిక సంస్థల మీద అధికారులు కానీ, ఎమ్మెల్యేలు కానీ పై పెత్తనం చేయడం వల్ల ప్రజలకు జరిగే మేలు కంటే కీడు ఎక్కువ. గ్రామ స్థాయిలో ఏ పని చేపట్టడం అత్యవసరమో ఆ గ్రామంలోని ప్రజలతో మమేకమై తిరిగే వాడికి తెలుస్తుందా? ఎక్కడో కూర్చొని నిర్ణయాలు తీసుకునే అధికారులకు తెలుస్తుందా? పల్లెలలో జరిగే పనుల నిర్ణయం స్థానిక సంస్థల పాలక వర్గాల చేతుల మీదుగా జరిగితే, ఆ నిర్ణయంలో పాలు పంచుకునే అవకాశం ప్రజలకు కూడా లభిస్తుంది. పనుల మీద పర్యవేక్షణాధికారం ప్రజా ప్రతినిధులకు వుంటే, వారు ప్రజలకు జవాబుదారీగా వుంటారు. అది జరగనప్పుడు ఓటు వేయడంతో ప్రజల పాత్ర ముగిసిపోతుంది. ఆ పరిస్థితి స్థానిక సంస్థలలో తీవ్రమైన అవినీతికి దారి తీస్తున్నది. ఎమ్మెల్యేలు, అధికారులు, మండలాధ్యక్షులు, గ్రామ సర్పంచ్‌లు, జిప ఛేర్మన్లు తమ తమ స్థాయిలలో కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు తీసుకోవడానికి అలవాటు పడుతున్నారు. ఏ స్థాయిలోను తమ స్వంత పూచీ, బాధ్యత లేకపోవడం వల్లనే ఎన్నికైన ప్రజా ప్రతినిధులలో లంచం అంటే భయం లేకుండా పోతున్నది. దానివల్ల స్థానిక సంస్థలు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి.

ఈ అపసవ్యతను సరిదిద్దడం ముఖ్యమంత్రి కర్తవ్యం. రాజీవ్‌గాంధీ మీద భక్తి ప్రదర్శించుకోవడానికే కాక, స్వయంగా కూడా రాజశేఖరరెడ్డికి గ్రామ స్థాయి సమస్యలు, పరిస్థితుల మీద పూర్తి అవగాహన వుంది. పల్లె జీవితం నుంచి పైకి ఎదిగిన వారాయన. ఆయన హయాంలోనే గ్రామ పంచాయతీలు, మండలాలు స్వయంప్రతిపత్తి దిశగా ముందుకు నడవడం సమంజసం.

ఎమ్మెల్యేల ద్వారా ప్రతి పనీ జరిపించడం ఒక అలవాటుగా మార్చుకొంటున్నారు ముఖ్యమంత్రి. ఆ అలవాటు మాననిదే కాగితాల మీద స్థానిక సంస్థలకు ఎన్ని అధికారాలు ఇచ్చి వ్యర్థమే. ఎమ్మెల్యేలకు నిత్య పాలనా వ్యవహారాలలో, అధికారుల బదలీలలో ప్రమేయం లేకుండా చేస్తే తప్ప స్థానిక సంస్థలు తమ కాళ్ల మీద తాము నిలబడి బ్రతకలేవు.

ఈ ఎన్నికలలో ఇటు కాంగ్రెస్, అటు తెలుగుదేశం పార్టీలు పల్లె వాతావరణంలో రాజకీయ కాలుష్యం క్రుమ్మరించాయి. ఎట్టినా గెలవాలి అనే పట్టుదలతో డబ్బు, మద్యం ప్రవహింప చేశారు. కక్షల కొలిమి రాజేశారు. తీవ్రమైన వుద్రిక్తతలు రెచ్చగొట్టారు. అంత వుద్వేగ పూరిత వాతావరణం పల్లె జీవితాన్ని ఛిద్రం చేస్తుంది. తాము రాజేసిన నిప్పును చల్లార్చవలసిన బాధ్యత కూడా తమ మీదే వుందన్న నిజాన్ని రాజకీయ పార్టీలు గుర్తెరగడం అవసరం.

జిల్లా వార్తలు

6-7-1956

పేజీలు: 12 వెల:0-2-0

నెల్లూరు ముచ్చట్లు

పట్టపగలు మోసం

ఈనెల 4వతేది ఉదయం తాము యోగులమనీ, తమకు దైవదత్తమైన శక్తులున్నవని చెప్పుకుంటూ ప్రజలను మోసం జేస్తున్న షేక్ కురేషి దిల్దార్ హుసేన్, షేక్ కురేషి ఆసిక్ మహమ్మద్ అనే ఇరువురు అజ్మీరు వాస్తవ్యులు, గూడూరు తాలూకా కోట మజరా కొత్త పాళెం వాస్తవ్యుడు షేక్ ఖాదర్ బాషా అనే వ్యాపారిని నమ్మించి యుక్తితో రూ.912లు పట్టపగలు మోసం జేశారు.

4తేది ఉదయం 9గంటలకు ఈ ఇద్దరు యోగులు ట్రంకురోడ్డులో పోతూ, అప్పుడే మద్రాస్ బస్టాండ్‌లో కోట బస్సు దిగి కోఆపరేటివ్ బ్యాంకులో రూ.912లు కట్టుటకు ట్రంకురోడ్డు వైపు వస్తుండిన షేక్ ఖాదర్‌బాషాను పలుకరించి కుశల ప్రశ్నలు వేసి, వ్యాపార సాపారాల భోగట్టా అడిగినారట. ఆ యిరువురిలో ఒకరు ఖాదర్‌బాషా చేయితాకగా, వెంటనే తెల్లటి ద్రవం బాషా చేతి నుంచి ద్రవించిందట. దానితో భాషకు మిక్కిలి ఆశ్చర్యం కలిగింది. వారిరువురు నిజంగా యోగులేనని నమ్మాడు.

తర్వాత ఈ యిరువురు యోగుల్లో పెద్దవాడు తన సహచరుని బాషాను పూజ కోసం పూలు తెమ్మన్నాడట. దిన్నయోగి బాషా వెళ్లి పూలు తెచ్చిన మీదట, తమ వద్ద వున్న పూలు యేవో చెప్పవలసిందని గురువు (పెద్దయోగిని)ను వారిరువురు కోరారు. పెద్ద యోగి వెంటనే తడుము కోకుండా ఆ పూలు గులాబీలు అన్నాడట. అవి నిజంగా గులాబీలే.

50 నెలల క్రితం పోయిన ఏర్లు క్రితం

ఆ తర్వాత పెద్ద యోగి, చిన్నయోగి వద్ద ఒక పొట్లమిచ్చి కొంతదూరం వెళ్లి తిరిగి వచ్చి పొట్లం తీసుకున్నాడు. ఆ పొట్లంలో రూ.250/-లు వుండినవట. పిమ్మట్ ఖాదర్‌బాషాతో "నీ వద్ద యుండే డబ్బు మా వద్ద యివ్వు. దానిని మంత్రించి ఇస్తాము. అది యిబ్బడిగా వృద్ధి అవుతుంది" అని చెప్పారట. అతని వద్ద వున్న డబ్బు తమ వద్ద యిచ్చి వెనకు తిరగకుండా, ప్రక్కల చూడకుండా 100 గజాల దూరం వెళ్లి తిరిగి రమ్మని చెప్పినారట. ఖాదర్ బాషా నమ్మి, మోసపోయి వారు చెప్పినట్లుగానే యోగుల వద్ద రూ.912లు, వీరలు ఇచ్చి, 100 గజాలు వెళ్లి వెనకకు తిరిగి చూసేటప్పటికి అజ్మీర్ మోసపు మాంత్రీకులు పరారీ అయ్యారట.

ఛేర్మన్ ఎన్నిక

నెల్లూరు మునిసిపల్ ఛేర్మన్ ఎన్నిక 12తేది సాయంత్రం జరుగుతుంది. దువ్వూరు సుబ్రహ్మణ్యంతో పోటీజేసి ఓడిపోయిన వేలూరు సుబ్బరాయుడు, పాత రిట్ పిటిషన్ తీర్మానం అయ్యేవరకు ఛేర్మన్ ఎన్నిక జరగరాదని, కొత్తగా మరొక రిట్ పిటిషన్ ఈ వారం హైకోర్టులో దాఖలు చేశారని, పిటిషన్ విచారణ నిమిత్తం 12తేది నాటికే వాయిదా పడిందని తెలుస్తున్నది.

***

గూడూరు మునిసిపల్ ఛేర్మన్ ఎన్నిక గూడా 12తేది ఉదయం జరుగుతుందని తెలుస్తున్నది.

సారంగధర

గత 30తేది కస్తూరిదేవి పారిశ్రామిక విద్యాలయ సహాయార్థం ముఖ్యమంత్రి గోపాలరెడ్డి గారి అధ్యక్షత క్రింద ప్రదర్శించబడ్డ స్థానం వారి సారంగధర వసూళ్లను గురించి యింతవరకు సరిగ్గా లెక్కలందలేదు. దాదాపు 10వేలు వుండవచ్చునని, అంచనా వచ్చేవారం సరైన

తరువ 10వ పేజీలో

స్థానిక పీట్టాభిషేకంలో రక్తాభిషేకం

మండల, జడ్పీ ఎన్నికలను పురస్కరించుకొని రాష్ట్రంలో హింస ప్రజ్వరిల్లింది. అధికారం చేజిక్కించుకోవాలన్న దుర్బుద్ధితో అధికార పార్టీ ఘర్షణలు, గృహ దహనాలు, హత్యలు, కిడ్నాపులు, బెదిరింపు చర్యలకు పాల్పడింది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రధాన పార్టీలు డబ్బుతో పాటు మద్యం మత్తులో జనాన్ని ముంచెత్తాయి. ఎన్నికల తర్వాత కూడా గ్రామాల్లో స్థానిక ఎన్నికల తాలూకు ప్రకంపనలుంటాయి. ప్రజాస్వామ్యం మేడిపండులా తయారయ్యింది. ఇప్పటికైనా పరిస్థితులను సరిదిద్దకపోతే ఎన్నికల్లో కోటీశ్వరులు, గూండాలు, రౌడీలు, నీచులు, నికృష్టులు తప్ప ప్రజాహితం కోరేవారు పోటీ చేయలేని పరిస్థితులు నెలకొంటాయి.

నెల్లూరు *బి.పట్టాభిరామయ్య*

పంచాయతీలకు అధికారాలివ్వండి

పంచాయతీ ఎన్నికలను కూడా వెంటనే నిర్వహించాలన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చేసింది. ఎన్నికయ్యే సర్పంచ్‌లకు రాజ్యాంగం దఖలు పర్చమన్న 29 అధికారాలలో ఏ ఒక్కదాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదు. వ్యవసాయం, భూసంస్కరణలు, చిన్నతరహా సాగునీరు, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమ, సామాజిక అడవుల పెంపకం, ఖాదీ గ్రామీణ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, విద్యుత్ పంపిణీ, వయోజన విద్య, మార్కెట్లు, సంతలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కుటుంబ, మహిళా సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం వంటి అంశాలేవీ పంచాయతీలకు బదలీ చేయలేదు. ఈ అంశాలన్నీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు బదలీ చేస్తే అసలైన గ్రామ స్వరాజ్యం వస్తుందనాలి. ఈ అధికారాల కోసం ప్రజలు, సర్పంచ్‌లు పోరుబాటన నడవక తప్పేట్లు లేదు.

గుంపర్లపాడు *బి.రామారావు*

పాలడైరీల నిర్వాకం

నెల్లూరు నగరంలో విజయా, దొడ్ల డైరీ పాల ఉత్పత్తులు విపరీతంగా అమ్ముడవుతాయి. కాని ఈ కంపెనీల పాలు, మజ్జిగ ప్యాకెట్లపై తయారీ తేది ముద్రించడం లేదు. అదేవిధంగా ధర కూడా ముద్రించడం లేదు. దీనివల్ల నిల్వ వుంచిన పాలు, మజ్జిగ కొని తాగిన వారు ఇబ్బందులు పడుతున్నారు. రేటు ఎక్కువగా వుండే నేతి ప్యాకెట్ల పైనా రేటు, తయారీ

జనవాణి

తేదీలు లేవు. విజయా డైరీని ప్రభుత్వం నిర్వహిస్తుంది. దొడ్ల డైరీని నెల్లూరులో అతి పెద్ద కుటుంబీకులు నిర్వహిస్తున్నారు. వీరిలా నిబంధనలు అతిక్రమించి తమ డైరీ ఉత్పత్తులు అమ్ముతుంటే అధికారులు చూస్తూ ఊరుకోవడం దారుణం.

నెల్లూరు *టివి నారాయణ*

కలెక్టర్ ఆదర్శప్రాయుడు

జిల్లా కలెక్టర్ రవిచంద్ర దంపతులు జిల్లాలోని అధికారులు, ప్రజలకు ఆదర్శప్రాయులనాలి. విధి నిర్వహణను నిక్కచ్చిగా నిర్వహించే కలెక్టర్ రక్తదాన వుద్యమానికి జీవకర్రలా నిలవడం మామూలు విషయం కాదు. దీనికి గుర్తింపుగా కలెక్టర్ దంపతులకు గవర్నర్ బంగారు పతకం లభించడం జిల్లా వాసులందరికీ సంతోషదాయకం. హాస్టళ్లలో చదువుకొనే విద్యార్థినీ, విద్యార్థుల పట్ల ఆయన చూపుతున్న శ్రద్ధాసక్తులు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. జిల్లాలో చాలా రోజులుగా పరిష్కారం కాకుండా వున్న సమస్యల పరిష్కారం పట్ల కూడా కలెక్టర్ చొరవ చూపి శంకరన్, సుజాతారావు, జన్నత్‌హుస్సేన్, కె.రాజు మాదిరి నెల్లూరు వాసుల గుండెల్లో కలకాలం నిలచిపోవాలని ఆకాంక్షిస్తున్నాను.

కావలి *ఎస్.బాబు*

వివాదంలో శబరిమల

కోట్లాది మంది భక్తి విశ్వాసాలతో పూజించే శబరిమల అయ్యప్ప దేవస్థానంలో మహిళలు ప్రవేశించి అపవిత్రం చేశారని భూత భవిష్యత్ వర్తమానాల్ని విశ్లేషించే అష్టమంగళ దేవప్రశ్నం వెల్లడించింది. ఈ ప్రకటన తర్వాత 18 ఏళ్ల క్రితం తాను దేవస్థానంలో ప్రవేశించి స్వామి పాదాలు తాకానని కన్నడ నటి జయమాల ప్రకటించింది. దీనికి గాను తాను పశ్చా

తరువ 10వ పేజీలో

అన్ని స్కూళ్ళ, కాలేజీల యూనిఫాం మిల్లు ధరలపై 10% డిస్కౌంట్

రూ. 1000/- కొనుగోలుపై Wall Clock

రూ. 2000/- కొనుగోలుపై Wrist Watch

ఉచితం - ఉచితం

కమల్ జంక్షన్

కాపువీధి, నెల్లూరు. ☎2309199


నెల్లూరు సంగతులు

మత్తులో 'గమ్మత్తు' ఎన్నికలు

సింహపురి మహిళలు కష్టనష్టాల కోర్చి కదంతొక్కి సాగించిన మద్య నిషేధ వుద్యమంలో జిల్లా కీర్తి పతాక ఎగసి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. అటు వంటి చరిత్రగతిని మార్చిన చోటనే మద్యం ఏరులై పారి రికార్డు బద్దలు చేసింది. ఈ దుస్థితిని చూసి మహిళలు గుండెలు రగిలి; పొగిలి పొగిలి ఏడ్వడం మినహా పిడికిలి బిగించలేని నిస్సహాయ స్థితికి గతవారంలో జరిగిన జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు నెట్టివేశాయి. 2004 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా జిల్లాలో 21 కోట్ల రూపాయల మద్యం అమ్ముడుపోయి అందరిని ఆశ్చర్యపోయేలా చేసింది. అప్పటి అమ్మకాలు జిల్లా మద్యం అమ్మకాల చరిత్రలో ఓ రికార్డు. స్థానిక ఎన్నికలు, పాత ఎన్నికల రికార్డును బద్దలు చేసి 28

28 కోట్లకు పెరిగిన మద్యం అమ్మకాలు

కోట్ల రూపాయల మద్యం అధికారికంగా అమ్ముడయ్యేలా చేశాయి. సహజంగా ప్రతినెల జిల్లా వ్యాప్తంగా 16 కోట్లు, నెల్లూరు నగరంలో ఐదారు కోట్ల రూపాయల మద్యం వ్యాపారం జరుగుతుంది. స్థానిక ఎన్నికలను పురస్కరించుకొని మామూలు కంటే 70 శాతం అధికంగా మద్యం అమ్ముడయ్యి ఆల్‌టైమ్ రికార్డును సృష్టించింది. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల వారు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ మద్యాన్ని కొంటూనే బెంగుళూరు నుంచి చీప్ లిక్కరు లోడులు తెప్పించుకొన్నారు. అధికారికం, అనధికారికంగా కలుపుకొంటే 35 కోట్ల రూపాయల మద్యాన్ని ఈ ఎన్నికలను పురస్కరించుకొని నాయకులు పోస్తే జనం తాగి తూగారు. ఆ మత్తులోనే వెళ్లి ఓట్లను గుద్దారు. తాము సాగించిన మద్య నిషేధ వుద్యమాన్ని తమ భర్తలే కాలరాస్తుంటే భూదేవంత సహనంతో భార్యలు భరించక తప్పలేదు. గతంలో జరిగిన మద్య నిషేధ వుద్యమాలు... స్థానిక ఎన్నికల సమయంలో ఏరులై పారిన మద్యం జిల్లా ప్రజల హృదయాల్లో కలకాలం నిలచివుంటాయి. స్థానిక ఎన్నికల్లో మద్యం అమ్మకాల రికార్డును పంచాయతీ ఎన్నికలు తుడిచి పెడతాయేమో చూడాలి?



నెల్లూరు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలోనికి వెళ్తున్న వారిని మెటల్ డిటెక్టర్ సాయంతో తనిఖీ చేస్తున్న పోలీసులు.

ఓటర్లకు దొంగనోట్లు

మండల, జడ్పీటీసి ఎన్నికల సందర్భంగా మద్యం ఏరులై పారడంతో పాటు ఓటర్లకు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు 40 కోట్ల రూపాయల మేర డబ్బు పంపిణీ చేశాయి. ఈ కరెన్సీలో కొంతమేర నకిలీ నోట్లు వుండగా, మరికొంత నిల్వచేసి చెదలు పట్టిన బ్లాక్‌మనీ వుండడం విశేషం. సర్వేపల్లి, అల్లూరు, కావలి, కోవూరు నియోజక పర్గాల పరిధిలోని ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, అల్లూరు, బోగోలు, దగదర్తి, బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవలూరు జడ్పీ స్థానాల్లో పోటీచేసిన అభ్యర్థులు ఓటర్లకు డబ్బు బాగా పంచారు. ప్రతిష్టాత్మకంగా పోటీ జరిగిన జలదంకి, కలిగిరి, ఉదయగిరి, సీతారామపురం, ఎఎస్‌పేట, వింజమూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, పెళ్లకూరు, నెల్లూరు రూరల్ మండలాల్లో ఒక్కో ఓటుకు 200 రూపాయల నుంచి 600రూపాయల వరకు పంచారు. సముద్రతీర పట్టపు ప్రాంతాల్లో ఏ పార్టీ వారో తెలియదు కాని ఓటర్లకు నకిలీ కరెన్సీ కూడా పంచారు. బందోబస్తు పర్యవేక్షణకు వెళ్లిన పోలీసులు ఈ విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలిగిరిలో ఓ పార్టీ అభ్యర్థి పంచిన కరెన్సీ నోట్లు చెదలు పట్టి వుండడాన్ని బట్టి ఇది బ్లాక్‌మనీగా అధికారులు అభిప్రాయపడ్డారు. డబ్బు తీసుకొన్న ఓటర్లు తీసుకొన్న పార్టీకే ఓటేశారు. డబ్బుతో పాటు చాలాచోట్ల చీప్ లిక్కర్ లేదా బీరు బాటిళ్లను రాజకీయ పార్టీలు ఓటర్లకు అందించాయి. అల్లూరు, కోవూరు, విడవలూరు జడ్పీటీసి స్థానాలలో పోటీపడ్డ అభ్యర్థులు ఓటర్లకు చీరలు, జాకెట్లు సైతం పంచారు.

పార్టీల తెలివి

పోలింగ్‌లో రికార్డు

జిల్లాలో 2తేది జరిగిన మండల, జడ్పీటీసి ఎన్నికలను పురస్కరించుకొని జరిగిన పోలింగ్ ఉదయం తొమ్మిది గంటల వరకు మందకొడిగా సాగినా ఆ తర్వాత వేగం పుంజుకొంది. పురుషులకన్నా మహిళలు ఈ పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొనడంతో 15 జడ్పీటీసి స్థానాలలో 85 శాతాన్ని మించి పోలింగ్ జరిగింది. ఓజిలి మండలంలో 85.13 శాతం పోలింగ్ నమోదై జిల్లాలో మొదటి స్థానంలో నిలవగా, కోవూరులో అత్యల్పంగా 65.57

తొరవ 11వ పేజీలో

పోలింగ్ రోజు ఇంట్లో పిల్లులు ఎమ్మెల్యేలు

మండల, జడ్పీటీసి ఎన్నికలు జరిగిన 2తేది పోలింగ్ బూత్‌ల వద్దకు ఎమ్మెల్యేలు రాకూడదని ఎస్పీ సూర్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకొని ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు. పోలింగ్ ముందు రోజు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎవిఎస్ రెడ్డి అన్ని జిల్లాల ఎస్పీలకు ఫోన్ చేసి ఎమ్మెల్యేలు పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్తే శాంతిభద్రతలకు విఘాతం కల్గే అవకాశం వున్నందున, ఎన్నికలు ముగిసే వరకు వాళ్లను ఎక్కడికీ కదలకుండా చూడమన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎస్పీ, ప్రజా ప్రతినిధులకు ఫోన్‌చేసి చెప్పడంతో వారంతా ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌ల వద్దకు రాలేదు. అయితే ఎమ్మెల్యే స్టిక్కర్‌తో వుండే వాహనాల్లో అనుచరులు ఎక్కి అటుఇటు తిరుగుతూ కన్పించారు. కార్పొరేషన్, మునిసిపల్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల, జిల్లాలో ఎమ్మెల్యేల మూలంగా హింసాత్మక సంఘటనలు జరగడంతో ఎన్నికల కమిషన్, ఎమ్మెల్యేల హౌస్ అరెస్టుకు ఆదేశించింది. ఉదయగిరి, కోవూరు, అల్లూరు నియోజక పర్గాల పరిధిలో హింసాత్మక ఘటనలు జరుగుతాయన్న వుద్దేశ్యంతో కీలక పోలింగ్ బూతులను గుర్తించి అక్కడ కడవ పోలీసులను బందోబస్తు డ్యూటీలో వేశారు. అల్లూరు కాంగ్రెస్, తెలుగుదేశం వర్గీయుల మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వంద అడుగుల ముందే పెద్ద పెద్ద బ్యారికేడ్లు రోడ్డుకు అడ్డంగా కట్టారు.

ఎస్పీ గట్టి చర్యలు

మలేరియా, చికున్ గునియా నిధులు స్వాహా?

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జిల్లాలో మలేరియా, చికున్ గునియా వ్యాధుల నివారణకు విడుదల చేసిన నిధులు స్వాహా అయ్యాయి. నిధులు నామమాత్రంగా కూడా ఖర్చు చేయక ఖర్చు చేసినట్లు రికార్డుల్లో వ్రాశారు. మలేరియా, చికున్ గునియా జ్వరాల వ్యవహారంలో జనాన్ని చైతన్యం చేసేందుకు కరపత్రాలు, వాల్ పోస్టర్లు, దోమల నిర్మూలన మందులను హైదరాబాద్ నుంచి పంపినా, వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కూడా వీటిని పంపలేదు. కాని ఈ విషయమై తిరిగినట్లు టిఏ బిల్లులు చేసుకొన్నారు. ప్రభుత్వం పంపిన ప్రచార సామగ్రినంతా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని గదిలో పడేసి వున్నారు. తాము చేపట్టిన చర్యల వల్ల జిల్లాలో మలేరియా, చికున్ గునియా వ్యాధులు లేవని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లాలో మలేరియా, చికున్ గునియా కేసులు లెక్కకు మించి నమోదవుతున్నా వైద్య ఆరోగ్య శాఖలో చలనం లేదు. ఈ వ్యవహారమై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే బాగుంటుంది.

రంగడి రథాన్ని గాలికి వదిలారు

రంగనాయకుల స్వామి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత వుంది. వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చి రంగడి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో ఓలలాడుతారు. రంగడి రథాన్ని చాలా వీళ్ల క్రిందట తయారు చేశారు. ఆనాటి పని తనం దీనిలో కొట్టచ్చినట్లు కనపడుతుంది. అటువంటి రథాన్ని దేవాదాయ శాఖాధికారులు

కొరవ 8వ పేజీలో

2006 జడ్పీటీసి ఎన్నికల్లో విజేతలు

వ.సం.	జడ్పీటీసి స్థానం	విజేత పేరు	పార్టీ	మెజార్టీ
1.	ఎ.ఎస్.పేట	బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి	కాంగ్రెస్	3306
2.	ఆత్మకూరు	నాపా పెంచలయ్య	కాంగ్రెస్	7246
3.	అనంతసాగరం	కాలువ నరసింహులు	కాంగ్రెస్	6082
4.	రాపూరు	దుగ్గినేని రమాదేవి	కాంగ్రెస్	3779
5.	కలువాయి	సత్తెనపల్లి అదిలక్ష్మి	కాంగ్రెస్	1514
6.	చేజర్ల	పడిగి రవీంద్రబాబు	కాంగ్రెస్	7832
7.	పొదలకూరు	దేవరం అనూరాధ	కాంగ్రెస్	9991
8.	ముత్తుకూరు	బండెల వెంకటరమణయ్య	కాంగ్రెస్	1712
9.	వెంకటాచలం	రాచగిరి ఏడుకొండలు	కాంగ్రెస్	195
10.	నెల్లూరురూరల్	బద్దెపూడి రుక్మిణి	టిడిపి	669
11.	టి.పి.గూడూరు	గంధళ్ల శ్రీనివాసులు	కాంగ్రెస్	777
12.	ఇందుకూరుపేట	కొండ్రెడ్డి సంధ్య	కాంగ్రెస్	1512
13.	గూడూరురూరల్	మేకల రాజేశ్వరమ్మ	టిడిపి	1291
14.	మనుబోలు	దాసరి భాస్కరరావు	కాంగ్రెస్	639
15.	చిల్లకూరు	మేకల లక్ష్మి	కాంగ్రెస్	2572
16.	వాకాడు	కోట్లపాటి చిట్టిబాబు	కాంగ్రెస్	4995
17.	కోట	ముంగమూరి పార్వతి	కాంగ్రెస్	403
18.	చిట్టమూరు	వంక రమణయ్య	టిడిపి	190
19.	నాయుడుపేట	కామిరెడ్డి భారతి	టిడిపి	06
20.	పెళ్లకూరు	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి	టిడిపి	1282
21.	ఓజిలి	ముమ్మడి సుమ	కాంగ్రెస్	739
22.	సూళ్లూరుపేట	ఎం.పాండురంగయ్య	కాంగ్రెస్	485
23.	దొరవారిసత్రం	ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి	టిడిపి	1961
24.	డక్కిలి	నెలబల్లి రాజేశ్వరి	కాంగ్రెస్	649
25.	బాలాయపల్లి	చెరుకూరు రామచంద్రయ్య	కాంగ్రెస్	502
26.	వెంకటగిరి	బుట్ల నారాయణమ్మ	కాంగ్రెస్	1144
27.	తడ	గుజల కొళవి	టిడిపి	50
28.	బుచ్చిరెడ్డిపాళెం	ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి	టిడిపి	2915
29.	సంగం	తుంగా ఇందూధర్‌రెడ్డి	కాంగ్రెస్	3054
30.	అల్లూరు	బీద గిరిధర్	టిడిపి	4026
31.	దగదర్తి	గోగుల వెంకయ్య	కాంగ్రెస్	1304
32.	విడవలూరు	వీరి చలపతిరావు	కాంగ్రెస్	2084
33.	కొడవలూరు	నలవల శ్రీనివాసులు	టిడిపి	2023
34.	కోవూరు	తుమ్మల శుభలేఖ	టిడిపి	1100
35.	బోగోలు	ఉక్కాల నాగలక్ష్మి	కాంగ్రెస్	106
36.	జలదంకి	వంటేరు జయచంద్రారెడ్డి	టిడిపి	735
37.	కావలి	కందుల శ్రీనివాసులు	కాంగ్రెస్	1787
38.	కొండాపురం	బండ్లమూడి అనిత	కాంగ్రెస్	942
39.	కలిగిరి	మెట్టుకూరు చిరంజీవి	కాంగ్రెస్	1994
40.	వింజమూరు	తిప్పిరెడ్డి నారపరెడ్డి	టిడిపి	1981
41.	మర్రిపాడు	తెలజాల వెంకటసుబ్బరాజా	కాంగ్రెస్	5519
42.	దుత్తలూరు	పి.వెంకటసుబ్బరాయుడు	టిడిపి	1380
43.	వరికుంటపాడు	బోగినేని శ్రీనివాసులు	కాంగ్రెస్	220
44.	ఉదయగిరి	జి.వెంకటరమణమ్మ	కాంగ్రెస్	238
45.	సీతారామపురం	కల్లూరి వెంకటేశ్వరరెడ్డి	టిడిపి	731
46.	సైదాపురం	కాకాణి గోవర్ధన్‌రెడ్డి	కాంగ్రెస్	ఏకగ్రీవం

మొత్తం జడ్పీటీసిలు: 46 కాంగ్రెస్: 31 తెలుగుదేశం: 15


సెభాష్ కలెక్టర్!

మండల, జడ్పీటీసి ఎన్నికల కౌంటింగ్ జరిగిన 4తేది జిల్లా కలెక్టర్ రవిచంద్ర కలెక్టరేట్‌లోని తన సీటులో 20 గంటల పాటు లేవకుండా కూర్చొని ఆదేశాలు జారీచేస్తూ, ఫోన్‌లోనే సమస్యలు పరిష్కరిస్తూ ఫలితాల ప్రకటనకు మార్గం సుగమం చేశారు. ఆయనీ వ్యవహారంలో శ్రద్ధ తీసుకోకుంటే జిల్లాలోని

20 గంటలు పనిచేశాడు

46 జడ్పీటీసి, 585 ఎమ్పీటీసి ఫలితాల ప్రకటన 5తేది మధ్యాహ్నం వరకు కొనసాగేది. ఉదయం 8గంటలకు డికెడబ్ల్యు కాలేజీలోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు పరిశీలనతో ఎన్నికల డ్యూటీలో జాయిన్ అయిన కలెక్టర్ 5తేది వేకువ జాము నాలుగు గంటల వరకు తన సీటులోనే కూర్చొని దరిదాపులు 500 పైగా ఫోన్ కాల్స్ చేస్తూ, అందుకొంటూ కౌంటింగ్ వ్యవహారాలను పర్యవేక్షించారు. జిల్లాలో 13 చోట్ల కౌంటింగ్ ప్రారంభం కాగా ఎమ్పీటీసి, జడ్పీటీసి ఓట్లను వేరుచేసి కట్టలు కట్టి ఆ తర్వాత లెక్కింపు మొదలెట్టడంతో ఫలితాల ప్రకటన ఆలస్యమయ్యింది. రాపూరు, పొదలకూరు జడ్పీ స్థానాల ఫలితాల ప్రకటనకైతే తెల్లవారింది. కోట జడ్పీటీసి స్థానం ఫలితం అర్ధరాత్రి దాటాక ఒంటి గంటకు కాని తెలియరాలేదు. నాయుడుపేట ఫలితం ప్రకటనలోనూ అర్ధరాత్రి వరకు ప్రతిష్ఠంభన కొనసాగింది. జిల్లాలో చదువుల మంత్రి రాజ్యలక్ష్మమ్మ ప్రాతినిధ్యం వహించే వెంకటగిరి జడ్పీటీసి స్థానం ఫలితం మాత్రం మధ్యాహ్నం మూడు గంటలకు అధికారికంగా వెల్లడించారు. పెళ్లకూరు, సీతారామపురం, బుచ్చి, నెల్లూరు రూరల్, చిల్లకూరు, మనుబోలు, బాలాయపల్లి, వరికుంటపాడు, చేజర్ల, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు జడ్పీటీసి స్థానాల్లో విజేతలను రాత్రి 11 గంటల

తరువ 8వ పేజీలో



నెల్లూరులోని కౌంటింగ్ సెంటర్ పరిశీలనకు వెళ్తున్న కలెక్టర్ రవిచంద్ర

ఎన్నికల్లో 26 కేసులు

2తేది జరిగిన మండల జడ్పీటీసి ఎన్నికల్లో బాధ్యతలకు పాల్పడిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీకి చెందిన 26 మందిపై కేసులు నమోదు చేశారు. ఆ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు జరగడంతో 40 మందికి పైగా గాయాలయ్యాయి. పెళ్లకూరు, సీతారామపురం, మర్రిపాడు, ఉదయగిరి, బోగోలు, చిట్ట

ఎస్పీ వెల్లడి

మూరు, వరికుంటపాడు జడ్పీటీసిల పరిధిల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు జరిగాయి. కోట మండలం కొక్కుపాడు పోలింగ్ కేంద్రంలో డ్యూటీలో వున్న అధికారిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి కొట్టారు. కాని ఉన్నతాధికారులు ఈ విషయమై విచారించను వెళ్లగా అటువంటిదేమీ జరగలేదని ఆ అధికారి చెప్పడంతో వెనుతిరిగి వచ్చారు. గూడూరంలోనూ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు బాతీయ రహదారిపై మోహరించడంతో కావలి సిఐ అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అల్లూరు మండలంలోని అల్లూరు, నార్తుమోపూరులలో ఉద్రిక్తత పెరగకుండా కోవూరు సిఐ బాగానే కష్టపడ్డాడు. మర్రిపాడు మండలం పెగళ్లపాడు, జడ్పీ ఛేర్మన్ కాబోతున్న గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామంతోడేరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రతిపక్షానికి ఏజెంట్లు లేకుండా చేశారని ఆరోపణలొచ్చాయి. ఎన్నికల రోజు 14 ఫిర్యాదులు జిల్లా కలెక్టర్‌కు అందాయి.

వాడిన పువ్వు వికసించేనా?

జిల్లాలో జరిగిన మండల, జడ్పీటీసి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ కలువాయి, చేజర్ల, పొదలకూరు, మనుబోలు, కోట, చిట్టమూరు, పెళ్లకూరు, విడవలూరు, ఉదయగిరి జడ్పీటీసి స్థానాలతో పాటు, 83 ఎమ్పీటీసి స్థానాలకు పోటీ చేసింది. ఒక్క జడ్పీటీసి స్థానాన్ని కూడా ఆ పార్టీ గెలవలేక పోయింది. చావు తప్పి కన్నులొట్టబోయినట్లు ఐదారు ఎమ్పీటీసి స్థానాల్లో గెలుపొందింది. సిపిఎం పార్టీ తెలుగుదేశం పార్టీతో సర్దుబాటు చేసుకొన్న కారణంగా కొడవలూరు, బుచ్చి, నెల్లూరు రూరల్ మండలాధ్యక్ష పదవుల్లో కూర్చోబోతుంది. సిపిఎం పార్టీ 20కి పైగా ఎమ్పీటీసి స్థానాల్లో గెలుపొందగా సిపిఐ మాత్రం కాంగ్రెస్‌తో జతకట్టినా రెండింటితో సర్దుకోవాల్సి వచ్చింది. ఇండిపెండెంట్లు మాత్రం 23 ఎమ్పీటీసి స్థానాలను పొందారు.

చివరి వరకు ఉత్కంఠతే!

జిల్లాలోని కొన్ని జడ్పీటీసి స్థానాల ఫలితాలు రౌండు రౌండుకు మారుతూ

బిజెపి దుస్థితి ఇది

ఇటు కాంగ్రెస్, అటు తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు, కార్యకర్తలను కూడా చివరి వరకు ఉత్కంఠతకు గురిచేశాయి. అందరికళ్లు మొదటి నుంచి పెళ్లకూరు స్థానం నుంచి పోటీ చేసిన తెలుగునేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భవితవ్యంపై దృష్టి సారించాయి. సాయంత్రం నాలుగు గంటలకు ప్రకటించిన తొలి రౌండ్‌లో ఆయన 250 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. ఆ తర్వాత అన్ని రౌండ్లలోనూ ప్రత్యర్థి కంటే పైచేయి చూపారు. విడవలూరు, ముత్తుకూరు జడ్పీటీసి స్థానాలకు పోటీ

తరువ 8వ పేజీలో

వోల్వో బస్సులో రొయ్యల కంపు

నెల్లూరు నుంచి బెంగుళూరు వెళ్లే ఆర్టీసి వోల్వో బస్సుల్లో రొయ్యల బాక్సులు పెడుతుండడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రాత్రి 10.30, 11 గంటలకు బెంగుళూరు వెళ్లే బస్సుల్లో వందకు పైగా ఐసు కూరిన రొయ్యల బాక్సులు పెడుతున్నారు. వీటి మూలంగా ప్రయాణీకులు తమ లగేజి

బెంగళూరు ప్రయాణీకుల లబోదిబో


బస్సులో పెట్టుకోలేకపోతున్నారు. ఎలాగోలా పెట్టుకొన్నా బెంగుళూరుకు వెళ్లేసరికి ఆ లగేజి నీరు కంపు కొడుతుంది. గతంలో ఈ విధంగా రొయ్యల బాక్సు వోల్వో బస్సులో పెట్టి పంపను ఆర్టీసినే బాక్సుకు 120 రూపాయలు వసూలు చేసేది. ఇప్పుడీ కాంట్రాక్ట్‌ను ఒక వ్యక్తికి నెలకు 15వేల రూపాయలకు అప్పజెప్పడం వెనుక ఆర్టీసి అధికారులకు భారీ ముడుపులు అందాయన్న విమర్శలున్నాయి. ఈ కాంట్రాక్టు పొందిన వ్యక్తి 60 కేజీల రొయ్యల బాక్సుకు 140 రూపాయల లగేజి వసూలు చేస్తున్నాడు. ఆర్టీసి కుదుర్చుకొన్న నెలకు 15వేల రూపాయల కాంట్రాక్ట్ వల్ల ఒక్కో రొయ్యల బాక్సుకు 10 రూపాయల లగేజి ఛార్జి పడుతుంది. రోజుకు 500 రూపాయల లగేజి ఛార్జి పొందను 500 రూపాయలు పెట్టి టిక్కెట్ కొనే 40 మంది ప్రయాణీకులకు ఇబ్బంది పెట్టడం భావ్యం కాదు. ఆర్టీసి అధికారులు వెంటనే ఈ రొయ్యల ఎగుమతి వ్యాపారం మానాలి.

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సాయం

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు వేదాయపాళెం బ్రాంచి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 30తేది కొండాయపాళెం హరిజనవాడలోని స్కూల్‌లో చదువుకొనే పిల్లలకు సాయం చేశారు. ఇక్కడి 110 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు,

తరువ 8వ పేజీలో





నెల్లూరు ఎమ్మెల్యేలు విశ్లేషణ

జడ్పీటీసీల్లో పొదలకూరు ఎమ్పీటీసీల్లో ఇస్కపల్లి ఫస్ట్

ఈ వారంలో ప్రకటించిన జడ్పీటీసీ, ఎమ్పీటీసీ ఫలితాల్లో జడ్పీటీసీల్లో మెజార్టీ రికార్డును కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకోగా, ఎమ్పీటీసీ స్థానాల్లో అత్యధిక మెజార్టీని తెలుగుదేశం పార్టీ పొందింది. పొదలకూరు జడ్పీటీసీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన దేవరం అనూరాధ తన సమీప ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీకి చెందిన అక్కెం శ్రీలతపై 9,991 ఓట్ల మెజార్టీ సాధించారు. అల్లూరు మండలం ఇస్కపల్లి-2 ఎమ్పీటీసీ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కొందూరు ప్రతాప్ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన బుచ్చం గారి యాదగిరిపై 2101 ఓట్ల మెజార్టీ సాధించారు.

ఓడిన ప్రముఖులు

జడ్పీ, ఎమ్పీటీసీ బరిలో దిగిన పలువురు ప్రముఖులు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. మొన్నటి వరకు నెల్లూరు రూరల్ మండలాధ్యక్షునిగా వ్యవహరించిన సిపిఎం నాయకుడు, జిల్లాలోనే పేరుగాంచిన లాయర్ వివి రమణారెడ్డి వావిలేటిపాడు ఎమ్పీటీసీ స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. నెల్లూరు రూరల్ మండలాధ్యక్షుడు కావాలని కలలుగన్న జిల్లా సిపిఐ కార్యదర్శి పముజుల దశరథరామయ్య కొత్తవెల్లంటి ఎమ్పీటీసీ స్థానంలో ఓడిపోయారు. అల్లూరు ఎమ్మెల్యే విష్ణు కుడిభుజం మేడా అశోక్‌కుమార్‌రెడ్డి సతీమణి నిరూప నార్తమోపూరు ఎమ్పీటీసీ స్థానంలో గెలవలేక పోయారు. జడ్పీటీసీలుగా పోటీచేసి ఓడిపోయిన ప్రముఖుల్లో వింజమూరులో గణపం బాలకృష్ణారెడ్డి, ఎఎస్‌పేటలో విజితార్ సుబ్బారెడ్డి, సీతారామపురంలో దుగ్గిరెడ్డి గురవారెడ్డిలు వున్నారు.

ఎమ్మెల్యేలను మారమని కోరిన ప్రజలు

జడ్పీ, ఎమ్పీటీసీ బ్యాలెట్ పెట్టెలలో ఓట్లతో పాటు ప్రజలు, నాయకులకు పలు సూచనలు, సలహాలిస్తూ ఉత్తరాలు కూడా వేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి చెంచాగాళ్ల మాటలు వినడం మానాలని కోరారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యంను నేలమీద నడవడం నేర్చుకోమన్నారు. అల్లూరు ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డిని దొంగలు, రౌడీలతో సంబంధాలు తెంచుకోవాలని ఓటర్లు కోరారు.

గెల్చిన విలేకరి

జడ్పీ, ఎమ్పీటీసీ ఎన్నికల్లో పలువురు దినపత్రికల విలేకరులు పోటీ చేశారు. ప్రజాశక్తి దినపత్రిక బుచ్చి, అల్లూరు ఎమ్పీటీసీ స్థానాల నుంచి తమ విలేకరులను పోటీకి నిలబెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. తెలుగుదేశం పార్టీ చిట్టమూరు జడ్పీటీసీ స్థానం నుంచి వంక రమణయ్యను పోటీలో పెట్టగా ఆయన గెల్చారు. రమణయ్య గతంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలకు చిట్టమూరు మండల విలేకరిగా పని చేశారు. సైదాపురం జడ్పీటీసీ నుంచి గతంలో ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేసిన గంగాధర్‌కు తెలుగుదేశం పార్టీ టిక్కెట్ ఇచ్చినా ఆయన విఫారం తీసుకోకమునుపే కాంగ్రెస్ పక్షంతో కుమ్మక్కై నామినేషన్ ఉపసంహరించుకొన్నారు.

అదృష్టం

2వ పేజీ కొరవ

లోని మొత్తం ఐదు జడ్పీటీసీలకు గానూ నాలుగింటిని తన ఖాతాలో జమ చేసుకున్నది తెలుగుదేశం. ఒక్క సూళ్లూరుపేట మాత్రమే కాంగ్రెస్‌కు దక్కింది. ఇంత ప్రతికూల ఫలితాలకు అక్కడి ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ధోరణే కారణం అన్నది ఆరోపణ. అభ్యర్థుల ఎంపిక తన ఇష్ట ప్రకారం జరగాలని పట్టుబట్టారాయన. దానికోసం అందరితో పేచీకి దిగాడు. పరుషంగా మాట్లాడాడు. దాని ప్రభావం ఫలితాల మీద కన్పించింది. నేరుగా ఎమ్మెల్యేను ఎదిరించి బదులు చెప్పలేని వారంతా పోలింగ్ మీద తమ శక్తిని చూపించారు. అధికార దర్పంతో కాక, అనునయంతో మండల నాయకులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేసి వుంటే ఈ నియోజక వర్గం ఈ గతి పట్టి వుండేది కాదు. అల్లూరు విషయంలోను అదే జరిగింది. ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నియోజక వర్గంతో, ప్రజలతో పూర్తిగా సంబంధాలు కోల్పోయాడు. కాంగ్రెస్ కార్యకర్తలలో ఒక విధమైన నిరాశా నిస్పృహలు వ్యాపించి వుండినాయి. కప్పరాళ్లతిప్ప నేరస్తులతో ఎమ్మెల్యే మమేకం కావడం రైతాంగంలో తీవ్ర వ్యతిరేకతను పెంచింది. దాని ఫలితమే ఆయన స్వంత అల్లూరు మండలంలో కూడా అంత అవమానకరమైన ఓటమి. బీద సోదరులు విష్ణుపై తమకున్న కసిని ఈ విధంగా తీర్చుకున్నారు. నార్తమోపూరు ఎమ్పీటీసీలో కాంగ్రెస్ మండల అధ్యక్ష అభ్యర్థిని మేడా నిరూప ఓటమి కూడా ఎమ్మెల్యేకి తలవంపులు తెచ్చింది. బుచ్చి జడ్పీటీసీ పరిస్థితి కూడా అంతే. అసెంబ్లీ ఎన్నికలలో తన కోసం పార్టీ వదలి వచ్చిన గోవర్ధనరెడ్డి తిరిగి వెళ్లిపోయే వరకు పొగ పెట్టాడు. దాని ఫలితం, కాంగ్రెస్‌కు బలమైన ఈ స్థానం తెలుగుదేశం పరం కావడం.

ఉదయగిరిలో కూడా కాంగ్రెస్ దెబ్బతినడం విచిత్రం. నియోజక వర్గ అభివృద్ధి విషయంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామరెడ్డితో బహిరంగ చర్చ సవాలే చేసి, ఆపై ముందు సెబాష్ అన్పించుకున్న శేఖరరెడ్డి, మూడు జడ్పీటీసీలు తెలుగుదేశానికి అప్పనంగా అప్పజెప్పడం విచిత్రం. తన అభ్యర్థుల గెలుపుకు ధోకా లేదనే అతి విశ్వాసం ఆయన కొంప ముంచినట్లుంది. ఈ అలసత్వాన్ని మాదాల జానకిరాం బాగా ఉపయోగ పెట్టుకున్నాడు.

సర్వేపల్లిలో ఆదాల ప్రభాకరరెడ్డి, వెంకటగిరిలో నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మల విషయంలో ఇందుకు విరుద్ధంగా జరిగింది. ఈ రెండు నియోజక వర్గాలలో కాంగ్రెస్ గెలుపు పట్ల అనుమానాలు వుండినాయి. అది గ్రహించి కాబోలు, వీరిద్దరూ ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. అలిగిన వారిని బుజ్జగించడం, అందరినీ సమైక్యం చేయడంతో పాటు, ఓటర్లను కనక వర్షంలో తడిపి ముద్ద చేశారు. అందుకు తగిన ప్రతిఫలం – నియోజక వర్గంలోని అన్ని స్థానాలను గెల్చుకుని, మొదటి వరసలో నిలవడం.

రాపూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాత్రం చిన్న కష్టం కూడా లేకుండా ఈ ఘనత సాధించారు. తెలుగుదేశం నేత ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి నుంచి ఆయనకా సహకారం లభించింది. నామినేషన్ల సమయంలోనే సైదాపురం జడ్పీటీసీ స్థానంలో కాంగ్రెస్ జిప అభ్యర్థి కాకాణి గోవర్ధనరెడ్డితో రహస్య మంతనాలాడి, టిడిపి అభ్యర్థులందరినీ రంగం నుంచి తప్పించారాయన. అక్కడ మరిగిన రుచిలో ఎంత మాధుర్యం వుందో మనకైతే తెలియదు కానీ, తతిమా జడ్పీటీసీలు, చివరకు ఎమ్పీటీసీలకు కూడా టోకున బేరం మాట్లాడుకుని మొత్తం నియోజక వర్గంలో పార్టీ జెండా మడిచి జేబులో పెట్టుకుని ఎటో వెళ్లిపోయాడు. దానితో రామనారాయణరెడ్డి పని సుకరమై పోయింది. నియోజక వర్గం మొత్తం మీద ఏకపక్షంగా ఎన్నిక జరిపించాడు. ముప్పాతిక భాగం గ్రామాలలో టిడిపికి ఏజెంట్లు కూడా లేని పరిస్థితి.

కావలి మాగుంట పార్వతమ్మకు మాత్రం కష్టం అంటే ఏమిటో తెలియవచ్చిందీ ఎన్నిక ద్వారా. కొత్తగా తెలుగుదేశం పార్టీలోకి పునఃప్రవేశం చేసిన వంటేరు వేణుగోపాలరెడ్డి ఆమెకు పెద్ద సవాల్ విసిరాడు. ఉన్నట్లుండి ఒక ఉత్పాతం వలె సంభవించిన ఈ పరిణామాన్ని తెలివిగా ఎదుర్కొన్నారు మాగుంట కుటుంబీకులు. వంటేరు పునఃప్రవేశాన్ని జీర్ణించుకోలేని తెలుగుదేశం వాదులందరినీ సమీకరించి, ఆ పార్టీని దెబ్బ కొట్టారు.

గూడూరు నియోజక వర్గం ఎన్నికను జనార్దనరెడ్డి గారు తానే స్వయంగా పర్యవేక్షించారు. అయితే ఆయన అంత శ్రద్ధ తీసుకున్నా రెండు చోట్ల ఓటమి తప్పలేదు. చిట్టమూరు, గూడూరు స్థానాలు చేజారి పోయాయి. కోటలో పాగా వేయగలగడం ఈ ఓటమి భేదాన్ని మరపించింది. నల్లపరెడ్ల కుంభస్థలాన్ని అంకుశంతో పొడిచారాయన.

కోవూరులో ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిది నిజంగా అభిమన్యు పోరాటమే. కాంగ్రెస్, టిడిపిల మధ్య ఓట్లలో స్వల్ప తేడా మాత్రమే వున్న నియోజక వర్గం ఇది. కమ్యూనిస్టులు పోయి టిడిపితో జట్టు కట్టడంతో కాంగ్రెస్ సహజంగానే బలహీన పడింది. ఆ లోటును పూరించి తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి శీనయ్య పడిన యాతన అంతా ఇంతా కాదు. అంత శ్రమ పడబట్టే విడవలూరు, సంగంలలో విజయలక్ష్మి వరించింది. లేకుంటే కోవూరు, కొడవలూరులతో పాటు అవీ చేజారి పోయి వుండేవి. విడవలూరు విజయం శీనయ్య ప్రతిష్టను పెంచుతున్నది.

కాంగ్రెస్ పరంగా జరిగిన కృషిలో నాలుగవ వంతు కూడా టిడిపి పక్షంలో కన్పించలేదు. ఎంతో రాజకీయ మేధావి అనుకున్న సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి అన్ని విషయాలలోను పప్పులో కాలేశాడు. తానే జిప ఛేర్మన్ అభ్యర్థిగా నిలబడక తప్పని పరిస్థితి వచ్చినపుడు, ఒక వ్యూహం ప్రకారం నడుచుకుని వుంటే ఫలితం వేరొక రకంగా వుండేది. కానీ ఎవరో చెప్పిన మాటలు విని పెళ్లకూరు వెళ్లి నామినేషన్ వేశాడు. అది అనాదిగా కాంగ్రెస్ స్థావరం. అక్కడకు వెళ్లిన తర్వాత కానీ విషయం అర్థం కాలేదు. తనకున్న సమయం, వనరులు, మంది మార్బలం సమస్తం దానికే సరిపోయింది. జిల్లాలోని తతిమా చోట్ల సంగతి దేముడెరుగు, తన స్వంత సర్వేపల్లిలో మీద కూడా శ్రద్ధ పెట్టలేక పోయాడు. సరైన సలహా పాటించి, బుచ్చిలో పోటీకి దిగి వుంటే, శ్రమ తగ్గి వుండేది; సర్వేపల్లి, అల్లూరు, కోవూరు నియోజక వర్గాలు మూడింటినీ సమాలించుకునే వీలు చిక్కి వుండేది.

జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఎంతటి దయనీయ స్థితిలో వుందో అర్థమయ్యేట్లు చేసిందీ ఎన్నిక. కుక్క చింపిన విస్తరి వలె వున్న పార్టీని చక్కదిద్దుకోవడానికి గట్టి ప్రయత్నం ఏదైనా జరగకుంటే రేపటి అసెంబ్లీ ఎన్నికలలోను ఇదే దుర్గతి తప్పదు.

శ్రీ రామాలయ పునః నిర్మాణ కమిటీ

నరశింగరావుపేట - గూడూరు - నెల్లూరు జిల్లా.

మన గూడూరులోని నరశింగరావుపేటలో గల జీర్ణావస్థలో యున్నటు వంటి శ్రీ రామాలయంను పూర్తిగా నిర్మూలించి సరి కొత్తగా శ్రీరామ భక్తులు పునః నిర్మించుచున్నారు. భక్తులెల్లరు విరివిగా విరాళాలు యిచ్చి తగు రశీదు పొందవలెనని ప్రార్థన. విరాళములు పంపదలచిన వారు ఈ క్రింది అడ్రసుకు చెక్కులు/ డి.డి / ఎం.ఓ. ద్వారా పంపగలరు.

SRI RAMALAYA RECONSTRUCTION COMMITTEE
2/76, NARASINGARAOPET. GUDUR - 524 101. NELLORE DIST.
Phone No: 08624 - 222460. Cell: 98490 16460

హృదయపూర్వక కృతజ్ఞతలు

బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ ఎన్నికలలో 2వ సెగ్మంట్ నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో గెలిపించిన సెగ్మెంట్ ప్రజలందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతూ... అలాగే మండల బిజెపి అగ్రనేతలైన **జి.వి.కృష్ణారెడ్డి, డాక్టర్ పి.రాఘవీరెడ్డి** గార్లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ 2వ సెగ్మంట్ ప్రజల అభివృద్ధి విషయంలో ముందుంటానని ప్రమాణం చేస్తూ....



సదా మీ సేవలో...
రామిశెట్టి భాస్కరరావు
ఎమ్పీటిసి, 2వ సెగ్మంట్, బుచ్చిరెడ్డిపాళెం

కృతజ్ఞతాభివందనములు

బుచ్చిరెడ్డిపాళెం మండలం వవ్వేరు ఎం.పి.టి.సి. స్థానం నుంచి మంచి మెజార్టీతో గెలిపించిన వవ్వేరు, రామచంద్రాపురం గ్రామ ప్రజలకు, నాకు అండదండలుగా వుండి, నా గెలుపునకు సహకరించిన అల్లూరు శాసనసభ్యులు

కాటంరెడ్డి విష్ణువర్ధనరెడ్డి గారికి,

కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమానులకు

అభివందనాలు తెలుపుతూ...



సదా మీ సేవలో...
బాంతా హరిబాబు
ఎమ్పీటిసి, వవ్వేరు

రాజశేఖర్‌రెడ్డి

మొదటి పేజీ కొరవ

చిక్కు తిడిపి ఒకటికి ఏడు జిల్లాలలో తన ప్రాబల్యాన్ని పెంచుకున్నట్లు రుజువు కావడం; తెలంగాణా మొత్తం మీద ఆ పార్టీ పుంజుకుందన్న భావన కల్గడంతో కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడిపోయింది. దాని నుంచి బయట పడడం ఎట్లనో అర్థం కావడం లేదిప్పుడు. ఈ పరిస్థితి కూడా ఊహించినదే కావడం గమనార్హం. తెలుగుదేశం కొంతలో కొంత పునరుజ్జీవనం పట్ల కాంగ్రెస్ గుండె బేజారెత్తి పోతున్నదని గత వారం ఇదే శీర్షికలో ప్రకటించిన సంగతి పాఠకులకు తెలుసు.

ఆరు నెలల క్రితం జరిగిన మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి ప్రతిష్టను అమాంతం ఆకాశానికి పెంచాయి. ఆయనకు తిరుగులేదు అన్పించాయి. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కూడా ఆయన గురించి మాట్లాడడానికి కూడా విమర్శకులు సాహసించలేని స్థితి కల్పించాయి. ఆ ఫలితాలతో పోలిస్తే, ఈ స్థానిక ఎన్నికల ఫలితాలు కూడా తీసి పారేయదగినవేమీ కాదు. ఒకరకంగా చెప్పాలంటే వాటికంటే గొప్ప విజయం ఇది. తాను చేసిన, చేయబోతున్న మంచి పనులను మాత్రమే ప్రజలకు గుర్తుచేసి ఓటు అడిగాడు ముఖ్యమంత్రి. దాని అర్థం పాజిటివ్ ఓటు అన్నమాట. రాష్ట్రంలో అరుదైన సందర్భాలలో తప్ప అధికార పార్టీ ఈ స్థాయిలో జనం వద్దకు వెళ్లడం జరగలేదు. రాజకీయ పరమైన ఆరోపణలు, విమర్శలు, తిట్లు, శాపనార్థాలతో మాత్రమే ఎన్నికల ప్రచారం జరగడం మనకు అనవాయితీ. దాన్ని భగ్నం చేశాడు ముఖ్యమంత్రి. ఆయన వినతిని జనం మన్నించారు. ప్రభుత్వంపై తెలుగుదేశం, మార్క్సిస్టులు కలిసి ఎన్ని ఆరోపణలు చేసినా; దిన పత్రికలు ఎంత బురద చల్లినా ప్రజలు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి మాటలు నమ్మారు. ఆయన చేసిన, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు తమ మద్దతు తెలిపారు.

సాధారణ విజయం కాదిది. పాజిటివ్ ఓటుతో గెలుపు సాధించిన ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి ఒక కొత్త చరిత్ర సృష్టించినట్లే లెక్క. అయితే రాష్ట్రంలో ఇప్పుడు నెలకొని వున్న వాతావరణం ఆ ఘనతను మసక వేస్తున్నది. ఇన్ని జిల్లాలలో గెలిచినా కూడా కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది అనే భ్రమ కల్పించడానికి ప్రయత్నం జరుగుతున్నది. అయితే కల్పన ఎంతో కాలం నిలవదన్నది వేరే సంగతి.

పరాభవం

2వ పేజీ కొరవ

గ్రామస్తులు కాపువీధి మనోభీష్టానికి విరుద్ధంగా ఓటు చేసి ఎరుగరు. ఇప్పుడా పుట్టింటిలో ఆనం కుటుంబ పరువు తీసిన ఘనత వివేకానందరెడ్డికి దక్కింది. ఏ ఎసి సుబ్బారెడ్డి పేరు చెప్పుకుని ఇంతకాలం ఆనం కుటుంబం రాజకీయ అధికారం అనుభవించిందో, అదే ఎసి మనుమడు ఆనం వెంకటరమణారెడ్డి చేతిలో ఇంతటి పరాభవం ఎదుర్కోవలసి రావడం గమనార్హం. నెల్లూరు ఎమ్మెల్యే నియోజక వర్గ పరిధిలో వున్న ఒకేఒక జడ్పీటీసి - నెల్లూరు రూరల్. చింతారెడ్డిపాళెం గ్రామంలో ఆయన మీద పెల్లుబిక్క అయిష్టత ఫలితంగా ఆ ఒక్క జడ్పీటీసి స్థానం కూడా కాంగ్రెస్ చేజారింది.

నిజానికి వివేకానందరెడ్డికి ఇటువంటి పరాభవాలు సర్వసాధారణం. ఐదేళ్ల క్రితం జరిగిన మునిసిపల్ ఎన్నికలో తన స్వంత తమ్ముడిని కౌన్సిలర్‌గా గెలిపించలేక, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేతిలో అవమానాల పాలైనాడు. మరొకసారి తమ స్వంత ఇల్లు వుండే కావువీధిలో తాము నిలబెట్టిన అభ్యర్థిని గెలిపించలేక నవ్వుల పాలైనాడు. ఇప్పుడు పుట్టిన ఊరు కూడా ఆయన్ను తిరస్కరించింది. ఎంత పుణ్యం చేసుకుని వుంటే లభిస్తాయి చెప్పండి ఇటువంటి ఘనతర అవమానాలు?

ఓటమి

మొదటి పేజీ కొరవ

పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుక పోవడానికి కారణం ఏమిటి అనేది ఇప్పుడు ప్రశ్న. గుంటూరు, ప్రకాశం జిల్లాలలో అయితే టిడిపికి సూకలు చెల్లిపోయాయనేంత దారుణంగా వున్నాయి ఫలితాలు. ఈ ప్రశ్నకు బదులేదీ అంటూ తత్వాలు పాడుకోవడం తప్ప, సమాధానం తెలుసుకోవడం టిడిపి నేతలకు చేతకావడం లేదు.

ఇరకాటమే

మొదటి పేజీ కొరవ


ఇంద్రారెడ్డి తన స్వంత చెల్లెలు కంటే ఎక్కువ. ఆమె సమక్షంలో, ఆ జిల్లాలో ఏ కార్యక్రమం మొదలు పెట్టినా ఫలిస్తుందనే సెంటిమెంట్ వుంది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జి.వినోద్, సీనియర్ నేత జి.వెంకటస్వామి కుమారుడు. ఆయన మీద నేరం పెడితే పెదార్థాలొస్తాయి. మూడు జిల్లాలలోనూ మూడు రకాల ఇరకాటాలు ఎదురుకావడంతో, ఓటమికి మంత్రులు, ఎమ్మెల్యేలను బాధ్యులను చేసి ఆలోచనకి పుల్లి చెప్పవలసి వస్తున్నది ముఖ్యమంత్రికి.

కె.కె.

మొదటి పేజీ కొరవ

ఈ మొత్తం వైఫల్యానికి కెకె చేతకానితనమే కారణమని తేల్చి పారేస్తున్నారు ముఖ్యమంత్రి వర్గీయులు. వారి వరస చూస్తుంటే, పిసిసి అధ్యక్షుడిని బలిపశువుగా మార్చడానికి పథక రచన జరుగుతుందన్న భావన బలపడుతోంది.

జిమిక్కైమ
వెంకటరమణ విలాస్ మిద్దెపైన,
పొగతోట, నెల్లూరు - 1.
ఫోన్: 2327354



ఓటరు దేవుళ్ళకు వందనాలు





నాకు రాజకీయం తెలియదు
పదవులకు కోసం ప్రాకులాడను
పది మందికి సేవ చేసే భాగ్యం కల్గుతుందనే ఆశతో
ఈ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచాను.
భగవంతుని దయతో నాకు లభించిన వనరులను
బుచ్చిరెడ్డిపాళెం 3వ సెగ్మంట్ ప్రజల అభివృద్ధికి,
అభ్యుదయానికి కృషి చేస్తానని,
నా ఈ అఖండ విజయానికి ఆహర్నిశలు కృషి చేసిన 3వ సెగ్మంట్
ప్రజలకు, ముఖ్యంగా నా మిత్ర బృందానికి
వందనాలు తెలుపుతూ
ప్రజలందరికి అందుబాటులో
వుంటానని తెలుపుతూ...

మీ
నెల్లూరు ద్వారకనాథ్‌రెడ్డి
ఎమ్పీటిసి, 3వ సెగ్మంట్,బుచ్చిరెడ్డిపాళెం

కృతజ్ఞతాభివందనములతో





బుచ్చిరెడ్డిపాళెం కాంగ్రెస్ ఎమ్పీటిసి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన బుచ్చి మండల ప్రజలకు, ఓటరు మహాశయులకు బుచ్చి 4వ సెగ్మంట్ ఓటరు దేవుళ్లకు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు పేరు పేరున కృతజ్ఞతాభివందనములు తెలుపుతూ
సదా మీ సేవలో...



లేబూరు వసంతి
ఎమ్పీటిసి, 4వ సెగ్మంట్,
బుచ్చిరెడ్డిపాళెం

దక్షిణపు హద్దు నిర్మాణం స్త్రీలకు అరిష్టదాయకం!

ఎ.రామచంద్ర చిత్తూరు

* *వీధి పోట్లున్నవ్యుడు వినాయక విగ్రహం ఆయా గోడల్లో ప్రతిష్ఠిస్తే సరిపోతుందా?*

వినాయక విగ్రహానికి గూడు, గూటికి తలుపు గూట్లో లైటు ఇలా పద్ధతులు పాటించి ఉదయాన్నే దీపంతో ఆరాధించాలి.

వాస్తు సందేహాలు - సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి

ఫోన్: 0861 - 5532337

4వ వీధి, గాయత్రినగర్

ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు - 4.

పి.జమదగ్నిశర్మ నెల్లూరు

* *దక్షిణం హద్దు చేసి గృహ నిర్మాణం చేయవచ్చునా?*

దక్షిణం హద్దు నిర్మాణం స్త్రీ దోషాన్ని, మృత్యు భయాన్నిస్తుంది. ధన నష్టం, సంతాన నష్టం కల్గిస్తుంది.

ఎన్.చాముండేశ్వరి చిత్తూరు

* *దిక్కుల్లో స్థలం ఏ పద్ధతి ప్రకారం వదలాలి?*

దక్షిణానికన్నా పశ్చిమం, పశ్చిమం కన్నా ఉత్తరం, ఉత్తరాన్ని మించి తూర్పు స్థలం ఎక్కువగా వదలాలి.

ఎస్.ఉమామహేశ్వరి చెన్నై

* *ఎగుడుదిగుడున్న యింట్లో వాస్తు హెచ్చు తగ్గులు పాటిస్తే సరిపోతుందా?*

ఎంతగా వాస్తు సూత్రాలు పాటించినా, ఇల్లు ఎగుడు దిగుళ్లు వల్ల సమాంతర కోణ ప్రక్రియ దెబ్బతిని, గృహస్తు చాలా సమస్యలకు గురౌతాడు.

ఎన్.భైరవసు బెంగుళూరు

* *12 చదరపు హస్తములకు చదరపు అంగుళాలెన్ని?*

ఇది 3చదరపు గజాలకు సమానం. 27 చదరపు అడుగులకు సరి అవుతుంది. 3888 చదరపు అంగుళాలకు సమానమవుతుంది.

టి.లక్ష్మీపార్థసారధి నెల్లూరు

* *ఎదురింటి గోడల 'కోణాలు' మా యింటి వైపు చూస్తున్నాయి. మేమేం చేయాలి?*

ఏ దిశా కోణాలయితే, ఆ దిశా ప్రభావాలు మీ యింటిపై వుంటాయి. మీ ఇంటి గోడల కోణాకృతుల్ని అర్ధవృత్తం చేసుకోవడం మంచిది.

సెభాష్ కలెక్టర్

5వ పేజీ కొరవ

తర్వాత ప్రకటించారు. ఎమ్మీటీసి ఫలితాల్లో తొలుత వెలువడిన ఫలితం సైదాపురం మండలంలోని తుమ్మల తలుపూరిది.



నెల్లూరు తెలుగుదేశం పార్టీ ఆఫీసులో ఫలితాల కోసం టీవి చూస్తున్న కార్యకర్తలు.

నెల్లూరు, బుచ్చి, ఆత్మకూరు, ఉదయగిరి కౌంటింగ్ కేంద్రాల్లో వార్తా సేకరణకు వెళ్లిన విలేకరులను పోలీసులు వెళ్లనీయక పోవడం వల్ల గొడవ రేగింది. ఉదయగిరి కౌంటింగ్ కేంద్రంలో పర్యవేక్షక అధికారి విజయకుమార్, విలేకరులకు మధ్య పెద్ద వాగ్వివాదం జరుగగా కలెక్టర్ జోక్యం చేసుకొని పరిష్కరించారు. కొండాపురం, వరికుంటపాడు కౌంటింగ్ కేంద్రాలలోని సిబ్బంది భోజనం అందక విధులు బహిష్కరిస్తే కలెక్టర్ స్వయంగా మాట్లాడి సర్ది చెప్పారు. రాపూరులో కౌంటింగ్ పర్యవేక్షకాధికారి ప్రభాకరరావు విధి నిర్వహణలో విఫలమైతే నెల్లూరు కౌంటింగ్ కేంద్రం నుంచి ఆర్డీఓ వెంకటరమణారెడ్డితో పాటు కొంతమంది సిబ్బందిని కలెక్టర్ అక్కడకు పంపారు. బోగోలు, నాయుడుపేట, తోటపల్లిగూడూరు ఫలితాల ప్రకటనలో గందరగోళాన్ని సమీక్షించి పరిష్కార మార్గాలు చూపారు. తోటపల్లిగూడూరు కౌంటింగ్ కేంద్రంలో జరిగిన గొడవ విషయమై కలెక్టర్ తక్షణం స్పందించక పోతే పెద్ద రచ్చారావిడికి దారితీసేది. తోటపల్లిగూడూరు, బోగోలు ఓట్ల లెక్కింపులో తమ పార్టీకి అన్యాయం జరిగిందని జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు చంద్ర మోహన్‌రెడ్డి చేసిన ఫిర్యాదులపై కలెక్టర్ వెనువెంటనే స్పందించి కౌంటింగ్ కేంద్రంలోని అధికారులతో మాట్లాడారు. తానే గణాంక అధికారిగా మారి 12 కౌంటింగ్ కేంద్రాల నుంచి వచ్చే ఎమ్మీటీసి, జడ్పీటీసి ఫలితాలను తానే రికార్డు చేసుకొంటూ, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు నివేదికలు పంపారు. ఎన్నికలు, కౌంటింగ్ నిర్వహణలో జరిగిన లోటుపాట్లు, భవిష్యత్తులో జరగకుండా ఒక డైరీని రూపొందించమని కలెక్టర్ 13 కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన అధికారులను కోరారు. కలెక్టర్‌కు ఈ వ్యవహారాల్లో డిఆర్వో చెన్నకేశవరావు, జడ్పీ సిఇఓ పెంచలరెడ్డి ద్వయం కూడా బాగా సహకరించింది.

వాడిన పువ్వు

5వ పేజీ కొరవ

చేసిన సిపిఎం అభ్యర్థులు మొదటి రెండు రౌండ్లలో ఆధిక్యత కొనసాగించినా ఆ తర్వాత చతికిలపడ్డారు. ఉదయగిరి, బోగోలు, గూడూరు, కోవూరు, బుచ్చి, వెంకటాచల సత్రం, వరికుంటపాడు, నాయుడుపేట, చిట్టమూరు, నెల్లూరు రూరల్, కోట జడ్పీటీసి స్థానాల్లో తుది రౌండు ఫలితాలు ప్రకటించే వరకు ఉద్విగ్నత చోటు చేసుకొంది. గూడూరు జడ్పీటీసి తొలుత కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినా అంతిమంగా తెలుగుదేశం చేజిక్కించుకొంది. వెంకటాచల సత్రంలో తొలుత సైకిల్ హవా వుండి చివరికి హస్తగతమయ్యింది. కాంగ్రెస్ జడ్పీటీసి అభ్యర్థుల్లో పొదలకూరు నుంచి ఎన్నికైన దేవరం అనూరాధ 9,991 ఓట్ల ఆధిక్యం సాధించగా, అత్యల్ప మెజార్టీ ఆరు ఓట్లను నాయుడుపేట జడ్పీటీసి స్థానంలో గెల్చిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కామిరెడ్డి భారతి తెచ్చుకొన్నారు. కోట ఫలితం ముందు తెలుగుదేశం వైపు మొగ్గినట్లు కనిపించినా అంతిమంగా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ముంగమూరు పార్వతి విజయకేతనం ఎగుర వేశారు.

రొయ్యల కంపు

5వ పేజీ కొరవ

జామెట్రీ బాక్సులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రబ్బర్లు, బలపాలు అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది రోడీఖాన్, నాగలక్ష్మి, జనార్దనరెడ్డి, హెడ్మాస్టర్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు

4వ పేజీ కొరవ

ఆలనాపాలనా లేకుండా గాలికి వదిలేశారు. గత ఏడాది వరకు రథోత్సవం అయిన వెంటనే రథాన్ని దేవాలయం సమీపంలోని రోడ్డు ప్రక్కనే తాటాకుల పందిరి క్రింద పెట్టి ఎండావానల నుంచి రక్షణ కల్పించేవారు. రథోత్సవం నాటికి మరమ్మత్తులు చేపట్టి అందంగా ముస్తాబు చేసి రంగడ్ని తెచ్చి కూర్చోబెట్టేవారు. కొత్త రథాన్ని తయారు చేయించే వుద్దేశంతో పాత రథాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శ వుంది. కొత్త రథాన్ని తయారు చేసుకొన్నా పాత రథాన్ని పదిలపర్చాల్సిన అవసరం ఎంతైనా వుంది.



చింతారెడ్డిపాళెం ఎమ్మీటీసి స్థానంలో తాను నిలిపిన అభ్యర్థి విజయోత్సవంలో తెలుగునేత ఆనం వెంకటరమణారెడ్డి.

'ఫ్లెమింగో' కవిత్వం, విందాం! వాంగో!!

ఇప్పుడొస్తున్న దీర్ఘ కవితలకు ప్రాచీన కావ్యరీతులైన ద్విపద, మంజరి ద్విపద మాతృకలు. ఇది యదార్థం కూడా!

కెఎస్వీ రాత్రి, సినారె దిగంబర, ఇటీవలి విశాఖ! విశాఖ! దీర్ఘ కవితల్లో ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి.

వీటిని ప్రేరణగా తీసుకొని చాలా దీర్ఘ కవితలు వచ్చాయి. దీర్ఘ కవిత రాసేటప్పుడు పదాల మీద, పదబంధాల మీద మోజు పనికిరాదు. పునరావృతాలు రాకుండా చూసుకోవాలి. వస్తువులో కవిత్వం, శిల్పం పొంగిపొర్లాలి. పేజీ పేజీలో, పలుకు పలుకులో వైవిధ్యం కనబరచాలి! ఇన్ని ఒడిదుడుకులను ఎదుర్కొని ఆ కావ్యం కాలానికి ఎదురీది నిలిచిందంటే అది గొప్ప కావ్యమే సందేహం లేదు.

పెరుగు రామకృష్ణ నెల్లూరు జిల్లాలో ఓ ఉత్సాహవంతుడైన కవి, స్వల్ప కాలంలో అనల్పంగా కవిత్వాన్ని నేర్చుకున్న యువ కవి. కవితలో విషయ సేకరణ, కవితా పుష్టి నిండుగా మెండుగా వున్నాయి.

ఫ్లెమింగో (విడిది పక్షుల దీర్ఘ కవిత) కోసం అతను పులికాట్, నేలపట్టు ప్రాంతాలను పరిశీలించాడు. పక్షుల దినచర్యను పరిశోధించాడు. ముందు పేజీల్లో ఈ అంశాల్ని వివరించిన తీరు చాలా బాగుంది. ఆ వివరాలు ఒక ఎత్తయితే, అతని కవిత్వం ఓ ఎత్తు.

ఫ్లెమింగోలో పక్షులు ఆ తీరాలకు ఎలా వస్తాయో రాసిన తీరు ఓ మాస్టర్ పీస్!

"కెరటాల కాళ్లతో, కదలి పరిగెత్తినట్లు
తెరలు, తెరలుగా,
గాలి ప్రవహించినట్లు
ఊపిరులూపిరులుగా, జీవితం
సాగిపోయినట్లు
వార్తలు వార్తలుగా ప్రపంచం
తిరుగుతున్నట్లు"

పక్షుల విన్యాసాలను ఎంతో శ్రద్ధగా, గమనించిన కవి అంటాడు కదా-

"జల మైదానంలో
ఎగిరి, దుమికి, గిరికీలు కొట్టి
నీటి కబడ్డీ ఆడి, ఒళ్లు విదిల్చి
రెక్కలార్చుకొనేది వక్షి!"

ఇలా, అలా కవిత్వాన్ని చదువుతూ పోతే 'ఫ్లెమింగో' చిత్రాన్ని చూసినట్లుంది. వాటి విన్యాసాలు కళ్లకు కట్టినట్లుంది.

అయితే - పక్షుల ప్రణయాన్ని గురించి గుప్పించిన పదాలు కొంత అసంతృప్తిని కలిగిస్తాయి. మసాలా కాస్త ఎక్కువయిందేమోననిపిస్తుంది.

ఒక సంగమకాంక్ష, ఖగసమాగమం, శృంగారరాగం, రతీదేవి నృత్య ప్రాంగణం, వాంఛా వాసన, ప్రణయోత్థాన ముఖరం, సంగమ హోమం పదాలా వాడటంలో కొంచెం కవి నిగ్రహం పాటించి వుంటే గుంభనంగా వుండేది.

"తెలుగు సౌందర్యం ప్రతిబింబించేలా ఆధునిక, ప్రాచీన పద ప్రయోగం జరిగిందని చెప్పుకున్న, రామకృష్ణ ప్రయోగాలు చూస్తే, అవి డిక్షనరీలు వెదుక్కోవలసిన పదాలుగా కనిపించాయి. పదం ఏదైనా సందర్భానికి అతక్కపోతే అది డాంబికము, శబ్దాడంబరమూ మాత్రమే అవుతుంది.

'పరీప్సలో తితుక్షులు, శింజాన గీతం, వర్ణనావల శతక ప్రవల్భికలు, నాచికోలు సమరం, శాంతి సంగాతి వంటి పదాల కోసం శబ్దార్థ కోశాలు వెదుక్కోవలసి వచ్చినప్పుడు భాషా సౌందర్యం ఎలా ప్రతిబింబిస్తుందో కవే చెప్పాలి?

పుస్తక సమీక్ష

'ఫ్లెమింగో'
(విడిది పక్షుల దీర్ఘ కవిత)
రచయిత
పెరుగు రామకృష్ణ
సమీక్షకుడు
పాయసం సుబ్రహ్మణ్య మహర్షి
పేజీలు: 42 మూల్యం: .30/-

అంత్యాను ప్రాస మోజులో

"పులికాట్టు అలల నిండా రంగేళి
పిల్ల పిచ్చుకల పారువేట కేళి"

అని రాసిన కవి "పారువేట" పదానికి ఏ అర్థం చెబుతాడు?

ప్రణయకేళిని గురించి చెబుతూ 'ప్రళయ కలాప లాతీల ఘోష' అనడం ఎంత విచ్చలవిడితనం?

నిజానికి సాహిత్య విమర్శ చాలా కాలంగా పొగడ్తల బాజాభజంత్రీ అయిపోయింది. తిట్టించుకోవడానికి ఎవరూ పీఠికలు రాయించుకోరు కదా? అని కొందరు జోకులేస్తుంటే, ఎవడెలా ఏడిస్తే మనకెందుకు లెద్దూ! అని విమర్శకులు ఓహో, ఆహో అని రివ్యూలు రాయడం వల్ల ప్రతిభావంతులు కూడా విదూషకుల పొగడ్తలకు అలవాటుపడి కొన్నాళ్లకు తెరమరుగై పోతున్నారు. ఈ నిజాన్ని గురించి మననం, పునశ్చరణం చేసుకోవలసిన బాధ్యత తెలుగు కవులది!

నిజానికి రామకృష్ణ సత్తా వున్న కవి. పొరబాట్లు సవరించుకోవడం, ఆత్మ విమర్శ చేసుకోవడం వల్ల రేపటి భవిష్యత్తు ఉజ్వలంగా వుంటుంది.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

E.A.No: 614 of 2006
E.P.No:86 of 2001
O.S.No: 81 of 1997

మల్లి దినపెంకటయ్య... పిటిషనరు
Vs
పల్లిపు శ్రీనివాసులు... రెస్పాండెంటు

పల్లిపు శ్రీనివాసులు అనువారికి సదరు దెంబరులోని పిటిషనరు చెక్ పిటిషను పెట్టి యున్నందున, మీకు ఆక్షేపణలున్న యెడల తే21-7-2006వ ఉ10గంటలకు కైకోర్టులో హాజరై తెలుపుకోవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

చిల్లకూరు రఘునాథరెడ్డి
పిటిషనరు తరపున న్యాయవాది

సినిమా

పాత నిషాలో త్రిష

హీరోయిన్ త్రిష తెలుగులోకి రాకముందే తమిళంలో ప్రియదర్శన్ 'లైసాలైసా' చిత్రంతో పరిచయం చేశాడు. ఈ చిత్రంలో శ్యామ్ హీరోగా పరిచయం అయ్యాడు. ఏం జరిగిందో ఏమోగానీ అప్పుడే తదుపరి సినిమాలో త్రిషతో చేయనని హీరో చెప్పాడట. ఆ తర్వాత త్రిష తెలుగులో పెద్దనటిగా పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం దర్శకుడు ప్రియదర్శన్ ఓ సినిమా తీయడానికి త్రిషను సంప్రదించాడు. దీనిలో ఎవరు హీరో అని ముందుగానే అడిగితే కొత్తహీరో అని చెప్పాడట. కొత్తవాళ్లతో నేనసలు చేయనని నిర్మొహమాటంగా చెప్పేసిందట. దీంతో ఏంచేయాలో తెలీక దిగాలుగా వెళ్లిపోయాడట ప్రియదర్శన్. మరి త్రిష మామూలు నటి కాదు గదా.

జలుబు తెచ్చిన తంటా

మల్లికాషెరావత్‌కు జలుబు చేయడంతో షోమన్ సుభాష్ ఘాయ్‌కు ఎక్కడలేని కోపం వచ్చింది. ఘాయ్ తీసిన షాదీసే పెహలే సినిమాలో మల్లికకు అవకాశమిచ్చాడాయన. ఈ సినిమా పబ్లిసిటీలో పాలుపంచుకోమని ఫోన్‌చేసి కోరాడట. ఆ సమయంలో మల్లికకు జలుబు చేసి వుండి రానందట. దీంతో ఆయనకు ఎక్కడలేని కోపం వచ్చింది. తాను తీస్తున్న సినిమాలో మల్లికా షెరావత్‌ను తీసిపారేశాడు. భవిష్యత్తులో సుభాష్‌ఘాయ్ తీసే ఏ సినిమాలోను మల్లిక వుండదని ముక్తా ఆర్ట్స్ ప్రతినిధి చెప్పారు. గతంలో సుభాష్‌ఘాయ్ మాటవినక హీరోయిన్ మహిమా చౌదరి బాగా దెబ్బతినింది. మల్లిక పరిస్థితి ఏమౌతుందో ఏమో?

ప్రియాంక రేటు పెరిగింది

సినిమా విజయవంతమైతే ఆ చిత్రంలో నటించిన హీరో, హీరోయిన్లు పారితోషికాలు పెంచేస్తుంటారు. మాజీ మిస్ ఇండియా ప్రియాంక చోప్రా పారితోషికం గతంలో అరకోటిగా వుండేది. క్రిష్ సినిమా విడుదలయ్యాక ఒక్కసారి తన

అరకోటి నుంచి కోటికి

పారితోషికాన్ని ఆమె 1.25 కోట్లకు పెంచింది. విషయం తెలియక ఆమెను బుక్ చేయను పోయిన నిర్మాతకు ఆమే స్వయంగా ఈ విషయం చెప్పడంతో నెత్తీ నోరు బాదుకొంటూ నమస్కారం పెట్టి బయట పడ్డాడట.

పెళ్లి కేసెట్‌ను దాచుకున్న శ్రియ

హీరోయిన్ శ్రియ పెళ్లి కేసెట్‌ను భద్రపరచుకుందట. ఏంటీ ఆమెకు పెళ్లి అయిపోయిందనుకుంటున్నారా... ఉత్తుత్తి పెళ్లి.

తొరవ 11వ పేజీలో



'అందాలరాముడు'లో సునీల్, ఆర్తీఅగర్వాల్

తనువెందుకు మనసుండగా

దేవదాసు, పోకిరి చిత్రాలు హిట్ కావడంతో ఈ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన ఇలియానా డైరీ రెండేళ్లు ఖాళీ లేనంతగా నిండిపోయింది. ఇటీవల జాదు షూటింగ్‌లో కనపడిన ఆమెను ఒక పథకం ప్రకారం నటి అయ్యి నిలదొక్కుకొన్నట్లుందే అంటే; భలేవారే... మొదట నాకు ఇన్ని ఆలోచనలు లేవు. మా అమ్మ గోవాలోని ఒక హోటల్‌లో మేనేజర్‌గా పనిచేసేది. ఆమెతో కలిసి ఒకరోజు హోటల్‌కు వెళ్తే ఓ కస్టమర్ ఈ అమ్మాయిలో హీరోయిన్ కనపడుతుందన్నారు. అమ్మ సలహా మీద మోడలింగ్‌లో అడుగు పెట్టాను. ఫెయిర్ అండ్ లవ్లీ ప్రకటనలో చూసి వైవిఎస్ చౌదరి, దేవదాసు చిత్రంలో అవకాశమిచ్చారు. నటన, డ్యాన్స్ నేర్పించారు. పోకిరిలో పూరీజగన్నాథ్ నన్ను అందంగా చూపి నా కెరీర్‌కు గట్టి పునాదులు వేశారు. జాదులో ప్రేక్షకులను ఇంకా ఆకట్టుకొంటాను. రెండు సినిమాల విజయాల తర్వాత కెరీర్‌ను జాగ్రత్తగా మలచుకోవాలని అడుగులు వేస్తున్నాను. నన్ను అభిమానించే వారంతా నాలోని శారీరక సౌందర్యాన్ని గాక మానసిక సౌందర్యం చూడమంటుంది. ఇది సాధ్యమవుతుందంటారా?

> ఇలియానా

బెల్లం చుట్టూ ఈగలు

బెల్లం చుట్టూ ఈగలు వుండడం సహజం. హీరోయిన్ ఛార్మి తమిళ నిర్మాతలకు బెల్లంలా తయారైంది. టి.రాజేందర్ తీసిన 'కాదల్ అజువత్తిల్' చిత్రంలో సైలాంబరాసన్ అనే హీరోతో మొట్టమొదటగా ఛార్మి నట జీవితం ఆరంభించింది. అది ఢమాల్ అనడంతో ఆమెతో సినిమాలు తీద్దామనుకున్న ఒకరిద్దరు నిర్మాతలు ఆ తర్వాత ఆమె ముఖమే చూడలేదు. దీంతో తెలుగు సినిమాల వైపు మొగ్గింది. 'నీతోడు కావాలి' అనే సినిమా చేశాక కృష్ణవంశీ గుర్తించి 'శ్రీఆంజనేయం'లో ఆమెను కరెక్ట్‌గా ఉపయోగించుకున్నాడు. ఆ తర్వాత ఛార్మి హవా తెలిసిందే. ప్రస్తుతం పెద్ద హీరోల సరసన చేస్తోంది. విచిత్రమేమంటే ఆమెను మళ్లీ తమిళ సినిమాల్లో లాక్కోరావాలని ఒకనాడు ఆమెతో సినిమాలు ఆపుకొన్న నిర్మాతలు ప్రస్తుతం హైదరాబాద్‌లో మకాం పెట్టారు. ఛార్మి ఏమాత్రం పొగరు

తొరవ 11వ పేజీలో

మసాలా పిల్లకు గిరాకీ

అందమైన రూపం, చూడచక్కని అంగసౌష్ఠవం, ఆకట్టుకొనే అభినయంతో ఐటమ్ గాళ్‌గా సినిమాల్లో ఒక్కో పాటలో కనపడే వారికి తెలుగు, హిందీ చిత్రాల్లో బాగా డిమాండ్ వుంది. రాఖీసావంత్, షెఫాలి జరీవాలా, కశ్మీరాషా, దీపల్‌షా, శీనోవార్ కబీర్, మహాయిల్ ఖాన్, కోయినా మిత్రా, మల్లికా అరోరా, పర్మిత్ కౌర్, పాయల్ ఒక్కో పాటలో కనిపిస్తూ బిజీగా వున్నారు. సినిమా కథకు సంబంధం వున్నా లేకున్నా మాస్ మసాల వున్న పాటకు అందమైన డ్యాన్సర్‌తో కలిసి హీరో ఆడిపాడడం ఎక్కువయ్యింది. అన్ని రకాల చిత్రాల్లోనూ ఈ పాటలకు చోటు కల్పించడంతో ఐటమ్ గాళ్స్‌కు డిమాండ్ పెరిగింది. ఒక్కో పాటకు 35లక్షలం వరకు పారితోషికం తీసుకొంటున్నారంటే వీరి ప్రాధాన్యత ఏమిటో అర్థంచేసుకోవచ్చు.

బరువు పెంచుకుంటున్న తనుశ్రీదత్తా

స్లిమ్ అండ్ ట్రిమ్‌గా వుండే తనుశ్రీదత్తా మిస్ ఇండియాగా ఎన్నికై ఆ తర్వాత హీరోయిన్ అయ్యింది. మిస్ ఇండియా కిరీటమే బాలకృష్ణ సినిమా 'వీరభద్ర'లో అవకాశం వచ్చేలా చేసింది. లీడ్‌రోల్ కాబట్టి ఒళ్లు చేస్తుందేమోనని బాలకృష్ణ జాగ్రత్తలు తీసుకోమన్నాడట. ఆ ప్రకారం తీసుకుని ఐదు కిలోలు బరువు తగ్గింది. ఇప్పుడు మళ్లీ బరువు పెరగాలని గట్టి నిర్ణయం తీసుకుంది. ఓ హిందీ సినిమాలో నటించడానికి సిద్ధమైంది. ఆల్‌రెడీ మిగతా భాషల్లో అవకాశాలు వచ్చినా హిందీ సినిమా కోసం మళ్లీ బరువు పెరగాలని నిర్ణయించుకుంది. మరి ప్రేక్షకులు దత్తా బరువు పెరిగాక చూస్తారోలేదో కాలమే నిర్ణయించాలి.

నేను మంచి 'కన్య'నే

హేమమాలిని తనయ ఇషాడియోల్ సహనటులెవరితోనూ తనకు సంబంధాలు లేవంటుంది. సహనటులతో తన అనుబంధాల గూర్చి పత్రికల్లో వచ్చిన వార్తలన్నీ వదంతులేనని కొట్టిపారేస్తుంది. అప్పుడే నేను డేటింగ్ చేయడమేమిటి? నేను

ఇషాడియోల్

చాలా చిన్నదాన్ని. ప్రస్తుతానికి నా ధ్యాసంతా పనిమీదే. నా సమయమంతా పనికోసమే కేటాయిస్తున్నాను. భావోద్వేగపరంగా చిత్రసీమలో ఎత్తుపల్లాలను ఎదుర్కొన్న స్నేహితులను చూశాను. అందుకే నా కెరీర్ తొలిదశలోనే డేటింగ్ వంటివి చేసి ఇబ్బందికర పరిస్థితులలో చిక్కుకోవాలని కోరుకోవడం లేదంది.

ఫ్రెండ్ కంటే ఎక్కువంటున్న పద్మప్రియ

నటి పద్మప్రియ 'పల్లియాల్' అనే చిత్రంలో సూర్యతో

తొరవ 11వ పేజీలో

కమల్ వికసించాడు

కమల్‌కు వయసు తగ్గింది. ఇదే విషయాన్ని ఆయనతో చాలామంది అనడంతో గొప్పగా ఫీలయ్యాడట. రెండు నెలలుగా చెన్నై నుంచి దూరంగా వెళ్లి అమెరికాలో వున్నాడు. అక్కడ నుంచి రావడంతో కొత్త గెటప్‌లో వచ్చాడు. షేవింగ్ చేసుకుని, ట్రిమ్‌గా జుట్టు కట్ చేసుకుని మణిరత్నం 'నాయకుడు'లో వున్నట్లుగా

> అమెరికా సోకు

వున్నాడట. రావడంతోనే తమిళ నటుడు గౌదాముని కుమార్తె వివాహానికి వెళ్లాడట. రిసెప్షన్‌లో అంతా కమల్ ఎట్రాక్షన్ అయ్యాడు. పెళ్లి కొడుకులా వున్నావసీ కొందరంటే యువ హీరోలకు పోటీగా అని మరికొందరు, ప్లాస్టిక్ సర్జరీ చేసుకున్నారా అని మరికొందరు అడిగేసరికి మీ అభిమానానికి థ్యాంక్స్ చెబుతూ తనెప్పుడూ కురాడినే అంటూ అక్కడి నుంచి చల్లగా జారుకొన్నాడట.

విక్రమార్కుడు విజృంభించాడు

వరుస విజయాలతో మంచి ఊపు మీద వున్న దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తాజాగా తన దర్శకత్వంలో 'విక్రమార్కుడు' చిత్రాన్ని రూపొందించాడు. ఇప్పటి వరకు ఆయన యాక్షన్ చిత్రాలకే దర్శకత్వం వహించాడు. ఇప్పుడు 'విక్రమార్కుడు' చిత్రాన్ని యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్‌ల మిళితంగా తీర్చిదిద్దాడు. ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రత్యేక ఆకర్షణ పొదిగాడు. ఆయన ఈ చిత్రం ద్వారా తన దర్శక ప్రతిభను మరోసారి చాటుకున్నాడు. ఆయన దర్శకత్వం కొన్నిచోట్ల సరళంగాను, కొన్ని చోట్ల ప్రౌఢంగా సాగింది. జీవితంలో మానవీయతా కోణాన్ని విశ్వజనీనతను ప్రతి పాత్రలోను, ప్రతి సన్నివేశంలోను ప్రతిబింబింప జేశాడు. ప్రేమ, పగ, ప్రతీకారాలను సరైన రీతిలో విశ్లేషించి ప్రభావశీలంగా సన్నివేశాలను, సంఘటనలను కల్పించి చిత్రానికి విశిష్టత కూర్చాడు.

కథలో దమ్ములేక పోయినా కథనాన్ని ప్రభావశీలం చేశాడు. ఆ కథనాన్ని తెరకెక్కించేందుకు వాడుకున్న లొకేషన్లలో దర్శకుని నైపుణ్యం అద్భుతంగా కళ్లకు కట్టింది. చంబల్ లోయ లొకేషన్లు, కర్ణాటక రాష్ట్రంలోని బదామి హిల్స్ ప్రాంతపు లొకేషన్స్ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

చిత్ర సమీక్ష

గ్రిద్దలూరుగోపాలరావు

విక్రమార్కుడు చిత్రంలో హీరో రవితేజ తొలిసారిగా ద్విపాత్రాభినయం చేశాడు. ఒక పాత్రలో విక్రమ్‌సింగ్‌గా నటిస్తాడు. రెండవ పాత్రలో సత్తిబాబుగా నటిస్తాడు. విక్రమ్‌సింగ్ మధ్యప్రదేశ్‌లోని చంబల్ లోయలో నిజాయితీపరుడైన పోలీస్ అధికారిగా పనిచేస్తుంటాడు. అక్కడ చలామణిలో వున్న ముఠా నాయకుడు బాపూజీ (వినీత్‌కుమార్) అరాచకాలను అడ్డుకుంటూ వుంటాడు. తనకు అడ్డు తగిలే విక్రమ్‌సింగ్‌ను అడ్డు తొలగించుకునే ప్రయత్నంలో బాపూజీ అతన్ని చావగొట్టాడు. చావుబ్రతుకుల్లో క్రిందపడిపోయిన విక్రమ్‌సింగ్‌ను అతని అనుచరుడైన మహంతి (రాజీవ్ కనకాల) అతన్ని వేరేవూరుకు తరలించి అక్కడ హాస్పిటల్లో చేర్పిస్తాడు.

విక్రమ్‌సింగ్ పోలికల్లో వున్న సత్తిబాబు (రవితేజ) తన మిత్రుడు బ్రహ్మానందంతో కలిసి దొంగతనాలు చేస్తుంటాడు. విక్రమ్‌సింగ్, సత్తిబాబును పిలిపించి తన కుమార్తె నేహా బాధ్యతను అతనికి అప్పగించి కన్నుమూస్తాడు. సత్తిబాబు, విక్రమ్‌సింగ్ నీతి నిజాయితీలను తెలుసుకుంటాడు. ఆ నీతి నిజాయితీలు సత్తిబాబులో పుట్టి పెరుగుతాయి. అతనిలో మానవత్వం చెలరేగుతుంది. అరాచకాల ముఠా నాయకుడైన బాపూజీని, అతని ముఠాను మట్టు బెట్టాడు.

విక్రమ్‌సింగ్, సత్తిబాబు పాత్రలు

తొరవ 11వ పేజీలో

గీత దాటి చూపలేను

రజనీ అల్లుడు ధనుష్‌తో పుదుప్పేటైలో తనుచేసిన డ్యాన్స్, నటన విమర్శల పాలయ్యిందంటుంది స్నేహ. ఈ సినిమాలో ఎంత బాగా చేసినా ఫలితం లేదని వాపోతుంది. ఈ సినిమాలో ఆమె చేసింది వేశ్య పాత్ర. తన కెరీర్ గూర్చి చెబుతూ తెలుగులో నాకు మంచి పేరే వచ్చింది. తెలుగు సినిమాల్లో గ్లామర్‌గా కనిపించే

> స్నేహా

పాత్రలు వస్తాయి. ప్రేక్షకులు వాటినే చూస్తారని కితాబిచ్చింది. తాజాగా ఆమెకు బాలీవుడ్ నుంచి ఆఫర్లు వచ్చాయి. దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి ఓ స్టోరీలైన్ చెప్పి వెళ్లాడట. ఆయన పిలుపు కోసం ఎదురు చూస్తోంది. అలాగే ఉదయ్‌కాంత్ అనే దర్శకుడు కూడా మరోకథ వినిపించే సరికి ఓకే అంది. ఈ రెండు సినిమాలతో హిందీలో బిజీ అవ్వాలని చూస్తోంది. బాలీ

తొరవ 11వ పేజీలో

ఎంతఫలాలు

తేది 8-7-2006 నుంచి 14-7-2006 వరకు రవి మిధునంలో, కుజ బుధ శనులు కర్కాటకంలో, శుక్రుడు వృషభంలో, గురువు తులలో, రాహువు మీనంలో, కేతువు కన్యలో, చంద్రుడు వృశ్చిక ధనుస్సు మకర కుంభాల్లో సంచరిస్తారు.

మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1 పాదం)

సంతాన మూలక ఆనందం వుంటుంది. ఆర్థికంగా సంతోషదాయకమైన కాలం. వృత్తిలో ఒత్తిడి ఉంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మానసికంగా కూడ ఇబ్బందులు వుంటాయి. చిన్న చిన్న తగాదాలుంటాయి. ఆంజనేయస్వామిని కొలవడం మంచిది. సోదరులతో ఇబ్బందుల పాలౌతారు. దగ్గరి ప్రయాణాలు లాభిస్తాయి. వారంతంలో మిత్రుల మూలంగా సహాయ సహకారాలందుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అనుకూలమైన తేదీలు 9,12. సోమ, గురువారాలు జాగ్రత్త.

వృషభం

(కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశీర్ష 1,2 పాదాలు)

వృత్తి రీత్యా బాగుంటుంది. ప్రక్కనున్న వారి కోసం ఖర్చులు చేయవలసి వస్తుంది. మంచి విజ్ఞాన అభివృద్ధికి ప్రయత్నాలు చేస్తారు. ఇతరులతో సంబంధ బాంధవ్యాలు బాగుంటాయి. మిత్రులు, సహాధ్యాయులతో వినోద యాత్రల్లో పాల్గొంటారు. కీర్తి ప్రతిష్ఠలు బాగుంటాయి. అధికారుల ఆదరాభిమానాలకు పాత్రులౌతారు. స్పెక్యులేషన్‌లో లాభాలుంటాయి. ఫర్నిచర్ కొనుగోలు చేస్తారు. అనుకూలమైన తేదీలు 13,14. ఆది, శుక్ర వారాలు జాగ్రత్త.

మిథునం

(మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

సోదరుల ఆరోగ్యలోపం ఆందోళన కల్గిస్తుంది. తండ్రి లేదా తల్లి ఇబ్బందుల పాలుగావచ్చు. వృత్తిలో పేరు ప్రతిష్ఠలుంటాయి. గౌరవమర్యాదలు ఇనుమడిస్తాయి. ఉద్యోగ విషయాల్లో కొంత శ్రమ వుంటుంది. స్త్రీ మూలక ఆనందం లభిస్తుంది. వారాంతంలో ఆరోగ్యమూలక ఆందోళనకు గురౌవుతారు. ఆర్థిక ఇబ్బందులుండవు. వివిధ మార్గాల్లో ధనాదాయం ఉంటుంది. వస్తువులు ఏవైనా పోగొట్టుకునే అవకాశాలున్నాయి. అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికలు వేస్తారు. అనుకూల తేది 14. ఆది సోమ వారాలు మంచివి కావు.

కర్కాటకం

(పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేషలు)

జీవిత భాగస్వామి మూలంగా కష్టనష్టాలుంటాయి. పెండింగ్ సమస్యలు తీరి వృత్తిలో మార్పు ఉంటుంది. బదలీలుంటాయి. ఆదాయంలో మంచి అభివృద్ధి ఉంటుంది. ఇతరులతో కొంత అభిప్రాయ భేదాలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. బంధు, మిత్ర సమాగమం సౌకర్యాలు కొరవడుతాయి. ఆటంకాలున్నా పనులు పూర్తవుతాయి. శుభకార్యాల్లో పాల్గొంటారు. అనుకూల తేదీలు 11,13. గురువారం మంచిది కాదు.

సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం)

ఊహించని ధనాదాయం వుంటుంది. అధికారుల అనుకూలత వల్ల పనులు జరిగిపోతాయి. వారారంభంలో మానసిక ఆందోళన ఉంటుంది. అదనపు బాధ్యతలుంటాయి. సోదరుల ద్వారా ఖర్చులుంటాయి. కంటికి సంబంధించిన ఆరోగ్య భంగం ఉంటుంది. ఆర్థిక సమస్యలు అంతగా బాధించవు. సంఘంలో పలుకుబడి ఉంటుంది. వారాంతంలో వస్త్ర, వాహన సౌకర్యాలుంటాయి. అనుకూల తేది 13. సోమవారం అంత మంచిది కాదు.

కన్య

(ఉత్తర 2,3,4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు)

నూతన వస్త్రాలు ఆభరణాలు కొంటారు. ధైర్యంగా అన్ని పనులు చేసుకొంటారు. తల్లి ఆరోగ్యం కొంత అశాంతి నిస్తుంది. ఖర్చు ఎక్కువగా వుంటుంది. ధార్మిక కార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు ధనలాభాలు. దైవ చింతన, ఋణాల బాధ, సామాజిక సంఘర్షణ, సామాన్య సంతోషం. వారం చివర శారీరకంగా నలత ఉంటుంది. బుద్ధి చురుకుగా పని చేయదు. వస్తువులు పోకుండా జాగ్రత్త అవసరం. వారాంతంలో మంచి వార్తలు వింటారు. అననుకూలమైన తేదీలు 11,14.

పంచాంగం

పంచాంగం

26-06-2006 నుంచి 27-7-2006 వరకు ఆషాఢమాసం. అన్నప్రాశన, సీమంతం, వధూవర దర్శనం, క్రయవిక్రయాలు చేసుకోవచ్చు.

జులై తిథులు

ఆషాఢ శుక్ల పక్ష

8 శని ద్వాదశి ప.11.23గం.ల వరకు
9 ఆది త్రయోదశి ప.11.03గం.ల వరకు
10 సోమ చతుర్థశి ప.10.14గం.ల వరకు
11 మంగళ పూర్ణిమ ఉ.9.00గం.ల వరకు
12 బుధ బహుళ ఉ.7.23గం.ల వరకు
13 గురు తదియ రా.3.16గం.ల వరకు
14 శుక్ర చవితి రా.12.51గం.ల వరకు

పి.ఎం.గోపాలాచారి, పాగతోట, నెల్లూరు

తుల

(చిత్త 3,4పాదాలు, స్వాతి, విశాఖ1,2,3 పాదాలు)

గృహ అవసరాలకు ఉపయోగపడే వస్తువులు కొంటారు. అధికారులతో గొడవకు దిగవద్దు. అలాగే సంతానమూలక ఇబ్బందులుంటాయి. సులభంగా అలసిపోతారు. కంటికి సంబంధించిన జాగ్రత్తలు వహించాలి. కుటుంబంలో చికాకులతో బాటు వస్త్రాభరణ ప్రాప్తి వుంటుంది. యాత్రా సందర్శనము ధనవృద్ధి, కార్యసిద్ధి, భోజన సౌఖ్యము, విశేష ఆరోగ్యం, ధన లాభాలు. మానసిక అశాంతి వృధా ఖర్చు వుంటుంది. అనుకూలమైన తేది 12. మంగళవారం మంచిది కాదు.

వృశ్చికం

(విశాఖ 4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఉద్యోగ విద్యాభ్యాసాల్లో ముందంజ ఉంటుంది. సంతానమూలకంగా ఆనందం. ఆరోగ్య భంగం ఉంటుంది. నచ్చిన వారితో ఆనందం పంచుకొంటారు. కాని కొందరితో అకారణ విరోధం ఏర్పడుతుంది. మానసిక అశాంతి ఉన్నా అనుకొన్నవి జరుగుతాయి. అనుకూలమైన తేది 14. మంగళవారం మంచిది కాదు.

ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

దైవికమైన, ఆధ్యాత్మిక విషయాలకు ప్రాముఖ్యం ఇస్తారు. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయ ఆందోళన కొంత వరకు తొలగుతుంది. తల్లి ఆరోగ్యలోప సూచనలున్నాయి. దూర వార్తలు కొంత వరకు ఆందోళన కల్గిస్తాయి. సరియైన భోజనం ఉండదు. ఊహించని రీతిలో ఖర్చులు ఉంటాయి. వాహనాలు నడిపేట పుడు జాగ్రత్త. 12, 15 అనుకూల దినాలు.

మకరం

(ఉత్తరాషాఢ, 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు)

ధనాదాయం బాగుంటుంది. ఇతరుల నుండి సహాయ సహకారాలు అందివస్తాయి. స్పెక్యులేషన్ లాభిస్తుంది. కుటుంబ ఖర్చులు వారాంతంలో పెరుగుతాయి. అనుకున్న పనులు వెరవేరుతాయి. వారం మధ్యలో అనవసరపు ఖర్చులు, వ్యర్థ ప్రయాణాలుంటాయి. వారాంతం సుఖ మయంగా ఉంటుంది. పుణ్యక్షేత్రాలు దర్శిస్తారు. జీవిత భాగస్వామితో సత్సంబంధాలుంటాయి. 9తేది అనుకూల దినం. మంగళవారం మంచిది కాదు.

కుంభం

(ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

మానసిక చింత ఎక్కువ. అనారోగ్య పరిస్థితి నుండి కోలుకుంటారు. ఇతరులతో గొడవలు వద్దు మీదే గెలుపు. స్థిర నిర్ణయం ఆత్మవిశ్వాసం అవసరం. అవకాశాలు జారవిడుచుకోవచ్చు. అప్పుల నుండి విముక్తి ఉంటుంది. క్రొత్త పరిచయాలు లాభిస్తాయి. వారాంతం గడ్డు సమస్యలు బాధిస్తాయి. గురు గ్రహాన్ని కొలవాలి. 12తేది అనుకూల దినం. బుధవారం మంచిది కాదు.

మీనం

(పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

శరీరానికి గాయాలు తగిలే అవకాశాలున్నాయి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి. సంతానాన్ని గురించి ఆలోచనలు ఎక్కువ చేస్తారు. దూర ప్రయాణాలు చేసే అవకాశాలున్నాయి. దైవ చింతన ఆధ్యాత్మిక చింతన అవసరం. ఉద్యోగస్తులు అధికారుల ఆదరాభిమానాలకు పాత్రులౌతారు, అదనపు బాధ్యతలు చక్కగా నిర్వర్తిస్తారు. అప్పుల నుండి, రోగాలు, ఒత్తిడి నుండి విముక్తి లభిస్తుంది. 14తేది అనుకూల దినం. ఆదివారం మంచిది కాదు.

జనవాణి

3వ పేజీ కొరవ

త్రాప పడుతున్నట్లు చెప్పింది. మయూరి సినిమా ద్వారా అందరికీ చిరపరిచితమైన నటి సుధాచంద్రన్ కూడా తాను స్నేహితురాళ్లతో కలిసి అయ్యప్ప సన్నిధికి వెళ్లి వచ్చినట్లు చెప్పింది. ఆలయ నిబంధనల ప్రకారం పది నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రవేశించకూడదు. దేవాలయంలో జరుగుతున్న అనేక అవినీతి అక్రమాల వల్ల, అపవిత్ర కార్యకలాపాల వల్ల స్వామి ఆగ్రహంగా వున్నట్లు అష్టమంగళ దేవప్రశ్నంలోనే తేలింది. అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన పూజారులు, పాలక వర్గాల సహకారంతో జరగడం దారుణం. పవిత్రమైన అయ్యప్ప సన్నిధిలో నియమ నిష్ఠలకు భంగం కలగకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం కన్నా ఆలయ ధర్మకర్తల పైనే ఎక్కువగా వుంది.

నెల్లూరు *వాస్తు రామచంద్ర*

అధ్వాన్నంగా అండర్ బ్రిడ్జి రోడ్డు

నెల్లూరు ముత్తుకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి దగ్గర మొదలయ్యే రోడ్డు దాకలిరేవు జంక్షన్ వరకు అత్యంత అధ్వాన్న స్థితిలో వుంది. దీనిమూలంగా అండర్ బ్రిడ్జిలో స్వేచ్ఛగా వెళ్తూ గోతులు గుర్తించక వాహన చోదకులు పడిపోయి గాయపడుతున్నారు. కార్పొరేషన్, ఆర్‌అండ్‌బి శాఖాధికారుల్లో ఎవరో ఒకరు ఈ రోడ్డును రిపేరు చేయించి పుణ్యం కట్టుకోగలరు.

నెల్లూరు *కె.బాలసుబ్రహ్మణ్యం*

బ్రహ్మాండమైన చట్టాలు

భారతదేశంలో రూపొందే చట్టాలు బ్రహ్మాండంగా వుంటాయి. కాని వీటి అమలు తీరే అధ్వాన్నంగా తయారయ్యి చివరికి నిర్వీర్యమవుతాయి. సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పథకాలలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం ద్వారా అవినీతిని అరికట్టుతుంది. జీవనోపాధి భద్రత చట్టం పేదరికాన్ని నిర్మూలించి, వలసలను నిరోధించి అవకాశాలను కల్పిస్తుంది. ఈ చట్టాలపై పత్రికలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించాలి.

నెల్లూరు *ఎం.కృష్ణకుమార్*

50 ఏళ్ల క్రితం

3వ పేజీ కొరవ

మొత్తం తెలుపబడవచ్చును.

కనకమ్మ గారి కృతజ్ఞత

టిక్కెట్లను అమ్మి పెట్టడంలో సహాయపడ్డ వారికిన్నీ, ప్రదర్శనానికి అవసరమైన అన్ని కుర్చీలను మద్రాసు నుంచి తెచ్చి ఏ ఖర్చులు పుచ్చుకోక సరఫరా జేసిన రమణ విలాస్ అధిపతి జివి రమణారెడ్డి గారికి కనకమ్మ గారు తన కృతజ్ఞత తెలుపుచున్నారు.

గాడేపల్లి రామయ్య వందనములు

స్థానం వారి సన్మాన కృషికి యెక్కువ సాయపడిన అప్పల ఆంజనేయులు గారికి సన్మానసభ కార్యదర్శి గను, ఆ సందర్భములో 'తుఫాను' నాటక ప్రదర్శనమున తనకు వెండికప్పు బహూకరించినందుకు వ్యక్తిగతంగాను గాడేపల్లి రామయ్య గారు తమ కృతజ్ఞతను తెలుపుచున్నారు.

స్థానంకు నెల్లూరులో ఘనసన్మానం

ఈనెల 1తేది ఆదివారం సాయంకాలం 6.30 గంటలకు నెల్లూరు పురమందిరమున, ప్రఖ్యాత నటులు, 'నటకావతంస' బిరుదాంకితులు, 'పద్మశ్రీ' విరాజితులు శ్రీస్థానం నరసింహారావు గారి సన్మానసభ అత్యంత వైభవోపేతంగా, విజయవంతంగా జరిగింది. సభలో, స్థానిక పురప్రముఖులు, పండితులు, నటకులు, నాట్యకళాభిమానులు, వారు వీర నలనేల, ఆబాలగోపాలం పాల్గొన్నారు. పురమందిరం ప్రజా సమూహంతో క్రిక్కిరిసిపోయింది. అనేకమంది మహిళలు సభకు విచ్చేసి, సదస్సుకు శోభను జేకూర్చిరి. ఆంధ్ర ముఖ్యమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు అధ్యక్షత వహించారు. రామ్‌మోహన్ ప్రార్థన సలిపిరి.

– విమర్శకుడు

గోపాలరెడ్డి గారు గోవిందరాజులు నాయుడు

సంస్కృతం నిర్బంధంగా ప్రవేశ పెట్టడములో తనపై వచ్చిన విమర్శలకు గోపాలరెడ్డి సమాధానం చెప్పు, యిది కొత్తగా తాను ప్రవేశ పెట్టింది కాదని, అయిదేళ్ల నాడు మద్రాసు ప్రభుత్వం సిలబస్ వ్రాయించిందని, దీనిని బట్టి తమిళనాడులో 40, ఆంధ్రలో 11 ప్రాచ్య విద్యాలయాలు వెలసినవని, అందువల్ల ఇది ప్రవేశ పెట్టింది సంస్కృతమంటే అభిమానముండే గోపాలరెడ్డి గాదని, అప్పుడు విద్యాశాఖాధికారిగా వుండిన గోవిందరాజులు నాయుడు ప్రభృతులని గోపాలరెడ్డి గారు వుద్ఘాటించారు. దీనిలో యదార్థం తెలియక, దురభిప్రాయం వల్ల వ్యతిరేక ప్రచారం చేశారని ముఖ్యమంత్రి గారన్నారు. ఈ సంవత్సరం ఆంధ్రలో ఆరు ప్రాచ్య విద్యాలయాలు నెలకొల్పబడుతున్నవని, నెల్లూరు జిల్లాలో నార్తురాజుపాళెం పాఠశాలే ప్రప్రథమమని, సంస్కృతమంటే పెనుభూతమని ఎలుగుబంటనే అభిప్రాయం సడలుతున్నదని, ప్రస్తుతం ప్రమోషన్‌తో పైకి వచ్చిన ఇద్దరు డివిజనల్ ఇన్‌స్పెక్టర్లు సంస్కృత అభిమానులని, అందువల్ల ముమ్ముందు దానికి మంచి ప్రోత్సాహముంటుందని తానాశిస్తున్నట్లు గోపాలరెడ్డి గారు ఆశాభావాన్ని వెలిబుచ్చారు.

పెండ్లిడ్ల పురాణం

గునుపాటి వారి పెండ్లి

కోటిరెడ్డి గారిని గూర్చి:-

"అబ్బకు సబ్బక్టు అనకుండ వక్తృత్వమెంత నిదుపో, మీనమంత వదుపు"

కొత్తూరు, గునుపాటి బలరామిరెడ్డి గారి పుత్రుడైన సుబ్బరామిరెడ్డి యొక్క పుత్రి చి.సౌ.నిర్మలకును, అంటే – టైమ్స్ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ విలేకరి జి.కె.రెడ్డి గారి సోదరుని పుత్రిక అన్నమాట –

గాంధీ శిష్యులును, మాజీ మంత్రి పుంగవులును, వ్యక్తిగత నడవడితో వుత్తములునగు కడప కోటిరెడ్డి బారిట్లా; సుద్దపల్లి రామచంద్రారెడ్డి గారి పుత్రిక, కడప జిల్లా బోర్డు అధ్యక్షిణిగా పరిపాలనా రథాన్ని పరుగెత్తించిన రాజకీయ చతురతగల కార్యదక్షురాలు శ్రీమతి రామసుబ్బమ్మ దంపతుల ద్వితీయ పుత్రుడు ఆయుష్మాన్ రామచంద్రారెడ్డి గారికిని 30.6.56తేది పగలు నెల్లూరు పురమందిరాన వివాహ మహోత్సవం శోభాయమానంగా జరిగింది.

కడప, నెల్లూరు జిల్లాలలోని పేరు మోగిన తలలన్నీ విచ్చేసినవి. ప్రథమంగా మద్రాసు నుంచి టేబిళ్లు, కుర్చీలు లారీల్లో దిగుమతి ఐ అందరికీ టేబిల్స్ మీద, అంటే దొరల భోజనం, సరఫరా అయింది. ఏర్పాట్లన్నీ పెళ్లి కూతురు చిన్నాయన, కార్యచతురుడు రామచంద్రారెడ్డి గారి యాజమాన్యాన జరిగినవి గదా! మొత్తం మీద పెండ్లి గ్రాండుగా వుండినది.

చెప్పడానికి మరచినా మన ముఖ్యమంత్రి గోపాలరెడ్డిగారు నంద్యాల నుంచి కారులో యెకాయెకి బైలుదేరి మంగళ సూత్రధారణ వేళకు అందుకోవడమొక విశేషం.

ఇక రెడ్ల పెండింగ్ల దిన్నర్లకు రమణ విలాస్ ధర్మాన మద్రాసు నుంచి టేబిళ్లు, కుర్చీలు దిగుమతి అవుతవన్న మాట. అంతకంటే శ్రీరమణ విలాస్ ఫర్నిచరంతా స్వంతంగా తెప్పించడం మెరుగనుకొంటాం.

– చిత్రగుప్తుడు

పోలింగ్‌లో రికార్డు

4వ పేజీ కొరవ

శాతం పోలింగ్ నమోదయ్యింది. చేజర్ల, చిట్టమూరులో 85.02 శాతం, కలిగిరిలో 83.68, దక్కిలిలో 83.43, పెళ్లకూరులో 83.35, వెంకటగిరిలో 82.77, ఇందుకూరుపేటలో 82.15, బాలాయపల్లిలో 81.75, దొరవారిసత్రంలో 81.64, జలదంకిలో 81.54 శాతం పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ అధిక శాతం జరిగితే సామాన్యంగా అధికార పార్టీకి వ్యతిరేకంగా ఫలితాలుంటాయని చెబుతారు. కాని స్థానిక ఎన్నికల్లో ఈ వ్యవహారం తారుమారయ్యింది.

చెదురుమదురు సంఘటనలు మినహా జిల్లాలో మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగానే జరిగిందనాలి. చిట్టమూరు మండలం ఈశ్వరవాక పోలింగ్ కేంద్రాల్లో దళితులను ఓటెయ్యకుండా అడ్డుకొన్నారని ఫిర్యాదులు రావడం, వరికుంటపాడు మండలంలో కొండాయపాళెం పోలింగ్ బూత్‌లోని బ్యాలెట్ బాక్స్‌లో నీళ్లు పోయడంతో రీపోలింగ్‌కు కలెక్టర్ ఆదేశించారు. సీతారామపురం చిననాగంపల్లిలో గుమికూడిన ఇరు వర్గాలను చెదరగొట్టను పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. నెలబల్లి గ్రామంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చీఫ్ ఏజెంట్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలాగి చేయి చేసుకొన్నారు. బోగోలు మండలం ఎలి కండ్రిగలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఏడు మంది గాయపడ్డారు. కావలి రూరల్ మండలంలోని బాలకృష్ణారెడ్డినగర్ వాసులు ప్రభుత్వం మంచినీటి సౌకర్యం కల్పించలేదని అలిగి పోలింగ్‌ను బహిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి జనార్దనరెడ్డి వాకాడులో ఓటు హక్కు వినియోగించుకొన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ఓటెయ్యను పోతే ఓటర్ల లిస్టులో ఆయన పేరు గల్లంతయ్యింది.

బ్రాహ్మణ వివాహ సంబంధాలకు

సంప్రదించండి

ఫోన్: 0861-5527494

e-mail: svsmarriagelinks@yahoo.com

స్నేహ

9వ పేజీ కొరవ

వుడ్‌లో అంటే బాగా నటించాలి కదా అని అడిగితే... తెలుగు సినిమాల్లో నటించి నట్లుగానే బాలీవుడ్‌లో నటిస్తాననీ. దేహ ప్రదర్శనలో లిమిట్స్ దాటనంటుంది. మరి ఈ లిమిట్స్ బాలీవుడ్‌కు నచ్చుతాయా?

ప్రియాంక

9వ పేజీ కొరవ

వరుడు... సూపర్‌స్టార్ రజనీకాంత్. ఇంకేముంది ఈ వ్యవహారం సినిమా అని అందరికీ తెలిసిపోతుంది. ఇటీవలే చెన్నైలో వెంకటాచలపతి కళ్యాణ మండపంలో రజనీకాంత్‌కు, ప్రియకు పెళ్లి జరిగింది. 'శివాజీ' సినిమా షూటింగ్‌లో భాగంగా జరిగిన తంతు ఇది. కానీ నిజమైన పెళ్లిని తలపించే రీతిలో జరిగిన ఈ వ్యవహారానికి ప్రియ ముగ్ధురాలైంది. కెవి ఆనంద్ తమ కెమెరాలో బంధిస్తే దాన్ని అడిగిందట. ఎందుకంటే దాచుకొంటానని చెప్పిందట. మణివణ్ణన్, వుడివుక్కరసు రజనీ తల్లితండ్రులుగా నటిస్తే, రాజా, ఉమాపద్మనాభన; ప్రియ తల్లితండ్రులుగా నటించారు. అచ్చం తన ఫ్యామిలీ మెంబర్ల లాగా వున్నారని మురిసిపోయిందట. బాగుందికదూ ఈ వరుస?

తనువెందుకు

9వ పేజీ కొరవ

లేకుండా సాధారణంగా వారిని ఆహ్వానించినా మళ్లీ పాత పాట రిపీట్ అవుతుందే మోనని సెంటిమెంట్‌తో ఆలోచనలో పడింది. తమిళ నిర్మాతలు మాత్రం ఛార్మి ఎక్కడకు వెళ్తే అక్కడకు ఆమె వెనుకన వెళ్తూ గ్రీన్‌సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నారు.

ఇషాడియోల్

9వ పేజీ కొరవ

కలిసి నటించింది. షూటింగ్‌లో వారిద్దరు చాలా దగ్గరయ్యారు. సినిమా పూర్తయ్యాక కూడా అదే కొనసాగిస్తున్నారు. లేటెస్ట్‌గా 'ఆటో' అనే సినిమాలో సూర్య నటిస్తున్నాడు. పూజ అనే హీరోయిన్ నటిస్తోంది. ఆ షూటింగ్‌లో కూడా పద్మప్రియ రోజు ఒక్కసారైనా సెట్‌కు వచ్చి బాతాఖానీ వేస్తుండడంతో వీరి ప్రేమ విషయం గుప్పుమంది. అయితే పద్మప్రియ మాత్రం అటువంటిదేమీ లేదు, సూర్య నాకు మంచి స్నేహితుడు. స్నేహితుడి కంటే ఎక్కువ అంటూ చెప్పి వెళ్లిపోయింది. మరుసటి రోజు కూడా వచ్చి ఈసారి మాట మార్చింది. ఆటో సినిమా దర్శకుడు భార్య నాకు ఫ్రెండ్. ఆమె కోసమే నేను వస్తున్నా నంటూ చెప్పింది. ఏమిటని సూర్యను అడిగితే అతను ఈ విషయాన్ని ఖండించలేదు.

చిత్రసమీక్ష

9వ పేజీ కొరవ

ఉన్నత స్థాయిలో ప్రతి పౌరునిలో వ్యక్తిత్వాన్ని వికసింప జేస్తాయి. కార్యదీక్షా దక్షతను ప్రభావితం చేస్తాయి. విక్రమ్‌సింగ్ పాత్రలో చురుకుదనాన్ని, సత్తిబాబు పాత్రలో చలాకీదనాన్ని రవితేజ తన నటనతో నెగ్గుక రాగలిగాడు. సత్తిబాబు పాత్రలో దర్శకుడు చొప్పించిన మేనరిజాన్ని రవితేజ లాలించి వల్లించి నవ్వుల జల్లులు చిలకరింపజేశాడు. ఇక హాస్య బ్రహ్మ బ్రహ్మానందం తన చమత్కారాలతో, చెణుకులతో వినోద రథంలో హాస్యతీరాల్లో విహరింప జేశాడు. తనంత తానుగా హీరోయిన్ అనుష్క హీరో సత్తిబాబు ప్రేమలో పడుతుంది. కేళీ విలాసాలకు సరితూగే వయసు, సొగసులతో శృంగారం ఒలకబోసింది. వినీత్‌కుమార్ బాపూజీగా గొప్పగా నటించాడు.

ఎంఎం రత్నం తన మాటల్లో సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. తీయని రుచులతో కమ్మని విందు చేసిన సంగీతానికి జేజేలు. అంతటి సంగీత మకరందాన్ని అందించిన కీరవాణికి జోహార్లు. పర్వేజ్ మూరి ఫొటోగ్రఫీ హైలెట్. హీరో ప్రదర్శించిన ఫైట్ సన్నివేశాలను దిటవుగా చిత్రీకరించాడు. అన్యాయాలు, అక్రమాలు ఎప్పటికప్పుడు ఎన్ని రూపాలైనా ఎత్తవచ్చు. అది ఎంతటి భయానకమైన రాక్షస ఆకారమైనా కావచ్చు. సంఘానికి చెడు చేసే దుర్మార్గాలన్నిటి మీద మానవుడి పోరాటం ఆగకూడదు. వాటిని మట్టుబెట్టేందుకు సమర భేరి మోగించాల్సిందే. ఈ మార్గదర్శక అంశాలతో దర్శకుడు చిత్రానికి గట్టి ఊపిరి పోశాడు. ఆ ఊపిరిని ప్రతి పౌరుడు పీల్చటం అవసరం.

In the Court of the Principal Junior Civil Judge :: Nellore

E.P.No.230/2003 :: O.S.No. 949/1999

Chalapathi Chit Fund Pvt Ltd. Nellore rep. by its Manager and foreman... DHR

Vs

1. Sk.Sardar Basha and others... J.Drs

NOTICE

To, JD3, Sk.Abdul Khadar S/o Sattar, S.R.Clerk, South Railway, Sullurpet, Nellore District.

పై నెంబరు డిపెండర్ చిట్టీ బాకీ రాబట్టుకొనుటకు మీ జీతంను జప్తి చేయమని కోరుచూ పై కోర్టులో E.P. దాఖలు చేసియున్నారు. సదరు E.P.లో మీరు Rule 48 నోటీసు నిమిత్తం తే18-7-2006దిన వాయిదా వేసి యున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10-30గం॥లకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీపరోక్షమున తీర్మానించబడును.

పేరేపి వేణుగోపాల్, B.Com., B.L.,

చిట్రీహోల్డర్ తరపు అడ్వకేటు, నెల్లూరు





ఓటరు దేవుళ్ళకు కృతజ్ఞతాభివందనాలు



స్థానిక సంస్థల ఎన్నికలలో బుచ్చిరెడ్డిపాళెం మండలంలో కాంగ్రెస్ పార్టీపై అత్యంత ఆదరాభిమానాలు చూపి 9 ఎమ్పీటిసి స్థానాలను అత్యధిక మెజార్టీతో గెలిపించి, అలాగే 6వ సెగ్మెంట్‌లో నన్ను 951 ఓట్ల భారీ స్థాయి మెజార్టీతో గెలిపించిన సెగ్మెంట్ ప్రజలకు హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలుపుతూ....

ఎల్లప్పుడూ ప్రజల సేవలో తరిస్తానని హామీ యిస్తూ..

మీ

ఎస్.కె.షాహుల్, ఎమ్పీటిసి, 6వ సెగ్మెంట్, బుచ్చిరెడ్డిపాళెం



బుచ్చిలో దేశం ప్రభంజనం - మండల ప్రజలకు కృతజ్ఞతలు



బుచ్చిరెడ్డిపాళెం జడ్పీటిసి అభ్యర్థిగా శ్రీ ఎర్రంరెడ్డి గోవర్ధనరెడ్డి గారికి, 8 మంది తెలుగుదేశం ఎమ్పీటిసిలకు, ముగ్గురు సిపిఎం ఎమ్పీటిసి సభ్యులకు అఖండ విజయం చేకూర్చిన మండల ఓటరు దేవుళ్ళకు, మండల టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలందరికీ మా కృతజ్ఞతాభివందనములు తెలుపుతూ...



సదా మీ సేవలో...



డొన్నలగడ్డ నారాయణరావు

(నారయ్య)

వైస్ ప్రెసిడెంట్,

వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంక్,

బుచ్చిరెడ్డిపాళెం

నూరా శ్రీనివాసులురెడ్డి

కోవూరు నియోజకవర్గ

సమన్వయ కమిటీ సభ్యులు

వంచేరు





ఉదయగిరి ఓటరు మహాశయులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు






శ్రీ నారా చంద్రబాబు నాయుడు



శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



శ్రీ మాదాల జానకిరాం




శ్రీ మాదాల తిమ్మయ్య




శ్రీ వై.టి.నాయుడు



వెంకట సుబ్బారాయుడు
జడ్పీటిసి సభ్యులు, దుత్తలూరు



శ్రీ కంభం విజయరామిరెడ్డి



మాదాల రామచంద్ర
ఎమ్పీటిసి సభ్యులు, నర్రవాడ

ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు జడ్పీటిసి సభ్యులుగా

శ్రీ వెంకట సుబ్బారాయుడు గారిని

నర్రవాడ ఎమ్పీటిసి సభ్యులు

శ్రీ మాదాల రామచంద్ర గారిని

తెలుగుదేశం పార్టీ తరఫున గెలిపించినందుకు దుత్తలూరు, నర్రవాడ
ఓటరు మహాశయులకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు

మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

... ఉదయగిరి తెలుగుదేశం పార్టీ

Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zamin ryot Press, Nellore